



వైఎంసీఏ వద్ద తీరానికి దగ్గరగా..



ముసురు

- నేడు కూడా వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో బుధవారం నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం, సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి సముద్రం మీదుగా వీస్తున్న తేమగాలులు తోడు కావడంతో చలి తీవ్రత పెరిగింది. శీతాకాలంలో చలి ఎక్కువగా ఉంటుందని, అదే సమయంలో వర్షాలు కురవడంతో వాతావరణం మరింత చల్లగా మారిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. గురువారం అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. చలిగాలులు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.

భూముల విలువ సవరణకు కసరత్తు

- 20న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రదర్శన
- 24 వరకూ అభ్యంతరాల స్వీకారం
- ఒకటో తేదీ నుంచి అమలు
- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో భూముల మార్కెట్ విలువల సవరణకు ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు ... మిగతా 6వ పేజీలో



కోకోనట్ ఎరీనా వద్ద అలల ఉధృతికి కోతకు గురైన తీరం

తీరం కోత

కురుసుర మ్యూజియం వద్ద దెబ్బతిన్న రక్షణగోడ

- వరుస తుఫాన్లు/అల్పపీడనాలతో సముద్రం వేడెక్కడంతో తీరంపై ప్రభావం
- నిపుణుల విశ్లేషణ

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా సముద్ర తీరం భారీగా కోతకు గురవుతోంది. కురుసుర మ్యూజియం వెనుక భాగంలో రక్షణ గోడ చాలావరకూ కూలిపోయింది. మ్యూజియం నుంచి ఉత్తరాన చిల్డ్రన్ పార్కు వరకూ కోత తీవ్రంగా ఉంది. అలల ఉధృతికి ఇసుక తిన్నెలు భారీగా కోతకు గురయ్యాయి. నాలుగు రోజుల క్రితం మొదలైన ఈ కోత ఇంకా కొనసాగుతూనే ఉంది.

ఏటా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురుసుర మ్యూజియానికి ఉత్తరాన తీరంలో సముద్రం ముందుకువస్తుంటుంది. అయితే ఈ ఏడాది తీవ్రత ఎక్కువ కావడంతో కోతకు గురైంది. అయితే తీరం కోతకు గురి కావడానికి ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో పాటు మరికొన్ని కారణాలు ఉన్నాయని విశాఖలోని సముద్ర అధ్యయన విజ్ఞాన సంస్థ చీఫ్ సైంటిస్టు డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ తెలిపారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతంలో అక్టోబరు, నవంబరు నెలల్లో రెండు తుఫాన్లు, డిసెంబరులో రెండు అల్పపీడనాలు వచ్చాయన్నారు. బంగాళాఖాతంలో తుఫాన్లు సంభవించిన కొద్దినెలల తరువాత కొన్ని ప్రాంతాల్లో సముద్రం కోతకు గురవుతుంటుందన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి బంగాళాఖాతం వేడెక్కుతుందని, దాంతో సముద్ర మట్టం పెరగడం, అలల ఉధృతి ఎక్కువ కావడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో తీరం కోతకు గురవుతుందన్నారు. గతంలో అంటే 2014 అక్టోబరులో హుద్‌హుద్ సంభవించిన రెండున్నర నెలల తరువాత అంటే డిసెంబరు చివరి, జనవరి తొలి వారంలో కురుసుర మ్యూజియం దక్షిణ భాగంలో బీచ్ కోతకు గురై రక్షణ గోడ కూలిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం అలల ఉధృతి మరికొద్ది కొద్దిరోజులు ఉంటుందన్నారు.

వివాదాస్పద స్థలానికి టీడీఆర్!

లేఅవుట్‌లో రిజర్వుగా పేర్కొన్న స్థలంలో నిర్మాణానికి ప్రైవేటు వ్యక్తి దరఖాస్తు

- అది రిజర్వు స్థలం అనే విషయం గమనించకుండా కొంత రోడ్డుకు వదిలేయాలని కోరిన జీవీఎంసీ
- నాలుగు రెట్లు విలువైన టీడీఆర్ జారీ
- ఇప్పుడా స్థలాన్ని కూడా కలిపేసుకుని బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తున్న టీడీఆర్ పొందిన వ్యక్తి
- నిబంధనలు బేఖాతరు
- ఫిర్యాదు అందినా చోద్యం చూస్తున్న అధికారులు



రోడ్డు విస్తరణలో 124 గజాలు స్థలం పోతుందంటూ జీవీఎంసీ టీడీఆర్ జారీచేసిన స్థలంలో నిర్మిస్తున్న వాణిజ్య భవనం

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

నగరంలో ఓ వివాదాస్పద స్థలానికి జీవీఎంసీ అధికారులు టీడీఆర్ (ట్రాన్స్‌బర్బల్ డెవలప్‌మెంట్ రైట్స్) జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడా స్థలం కూడా నగర పాలక సంస్థ స్వాధీనంలో లేకపోవడం, అందులో టీడీఆర్ పొందిన వ్యక్తే బహుళ అంతస్థుల భవనం నిర్మించుకోవడం విశేషం. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందినా రికార్డుల పరిశీలన పేరుతో నిర్మాణదారుడికి అధికారులు సహకారం అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ద్వారకా నగర్ నుంచి డైమండ్ పార్కు మీదుగా రైల్వే న్యూకాలనీకి వెళ్లే మార్గంలో వైజాగ్‌పటం కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో 1950లో ఒక లేఅవుట్ వేశారు. అందులో డైమండ్ పార్కుకు నాలుగు వైపులా కొన్నింటిని రిజర్వు స్థలాలుగా మార్కు చేశారు. వాటిలో రెండు జీవీఎంసీ ఆధీనంలో ఉండగా, మరో రెండు మాత్రం కోర్టు వివాదాల్లో ఉన్నాయి. డైమండ్ పార్కుకు ఉత్తరం వైపు ఉన్న 687.38 చదరపు గజాలు కూడా రిజర్వు స్థలంగానే లేఅవుట్‌లో పేర్కొనబడి ఉంది. అయితే లేఅవుట్ అవసరాల కోసం సామగ్రిని భద్రపరచుకునేందుకు అందులో 328 గజాల స్థలంలో సొసైటీ పేరుతో ఒక భవనాన్ని నిర్మించారు. దీనికి 1993లో జీవీఎంసీ ప్లాన్ జారీచేసింది. మిగిలిన 369 గజాలు ఖాళీగానే ఉంది. ఇదిలావుండగా ఆ భవనంతో పాటు మిగిలిన స్థలాన్ని సొసైటీ నుంచి 2009లో కొనుగోలు చేసినట్టు ఒక వ్యక్తి పత్రాలను చూపించి ఆ భవనాన్ని కూల్చేసి, కొత్త భవన ... మిగతా 6వ పేజీలో

స్థలం అన్యాక్రాంతంపై కదిలిన యంత్రాంగం

- సమగ్ర నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ అధికారులకు కలెక్టర్ ఆదేశం
- టౌన్‌ప్లానింగ్ అధికారులతో చర్చించిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 27వ వార్డు పరిధిలో కోణార్క్ లాడ్జి వెనుక 818 గజాల స్థలంపై వివాదం నడుస్తుండగా ప్రైవేటు వ్యక్తులు ప్రహరీ కూల్చి గోడ కూల్చి, చదును చేస్తుండడంపై జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌తోపాటు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ స్పందించారు. వైజాగ్‌పటం కో-ఆపరేటివ్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ 1950లో లేఅవుట్ వేసింది. అందులో రిజర్వు స్థలంగా మార్కు చేసిన 818 గజాల స్థలంపై జీవీఎంసీకి, ప్రైవేటు వ్యక్తి మధ్య హైకోర్టులో కేసులు నడుస్తున్నాయి. అయినప్పటికీ ప్రైవేటు వ్యక్తి ఆ స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చి చదును ... మిగతా 6వ పేజీలో

డెయిరీలో ఉద్రిక్తత

చైర్మన్ కార్యాలయం ముట్టడికి కార్మికుల యత్నం

- విధులు బహిష్కరణ
- దిగివచ్చిన యాజమాన్యం
- కార్మిక సంఘ నేతలతో చర్చలు
- పదవీ విరమణ వయసు పెంపు సహా పలు డిమాండ్లు నెరవేర్చేందుకు అంగీకారం
- ఆందోళన విరమిస్తున్నట్టు కార్మికుల ప్రకటన



చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ చాంబర్ ఎదుట బైఠాయించిన కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

కనీస వేతనాల చెల్లింపు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పీఆర్‌సీ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం గత 28 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విశాఖ డెయిరీ కార్మికులు బుధవారం చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సాయంత్రం యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో ఆందోళన కార్యక్రమాలను విరమిస్తున్నట్టు కార్మిక నాయకులు ప్రకటించారు. వివరాలిలా ఉన్నాయి.

యాజమాన్యంతో చర్చల కోసం ఉదయం కార్మిక నాయకులు నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. అయితే డిమాండ్లపై నోరుమెదపని యాజమాన్య ప్రతినిధులు తమకు మూడు నెలలు సమయం కావాలని చెప్పి వెళ్లిపోవడంతో కార్మిక నాయకులు నిరాశతో వెనుతిరిగారు. డెయిరీ వద్దకు చేరుకుని దీక్షలో ఉన్న కార్మికులకు జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన విషయం చెప్పారు. దాంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇక నిరాహార దీక్షలతో యాజమాన్యం దిగిరాదంటూ నినాదాలు చేసుకుంటూ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయించారు. సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ కార్మికులు వెనక్కి తగ్గకుండా గట్టిగా నినాదాలు చేయడంతో చివరకు డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్ బయటకు వచ్చి కార్మికుల డిమాండ్లు తెలుసుకున్నారు. డెయిరీ పాలకవర్గంతో చర్చించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనాలు అమలు చేస్తామని, కార్మికుల పర్మినెంట్ అంశం మాత్రం వారి సీనియారిటీ వంటి వాటిని పరిశీలించి పరిష్కరిస్తానని ఆనంద్‌కుమార్ చెప్పారు. మెటర్నిటీ లీవ్ ఇస్తామని తెలిపారు. ఆందోళన చేస్తున్న యూనియన్‌తో పాటు డెయిరీలో ప్రస్తుతం ఉన్న మరో యూనియన్‌తో కలిసి సమస్యలపై చర్చిద్దామన్నారు. దీనికి ఎంప్లాయిస్ యూనియన్ ... మిగతా 6వ పేజీలో

విమానాలు ఆలస్యం

ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ అందుబాటులో లేకపోవడమే కారణం

- వారం రోజులుగా ఇదే సమస్య
- వచ్చే ఏడాది జూన్ వరకూ పనిచేయదంటున్న అధికారులు
- కావాలనే చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయంటున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- కేంద్ర మంత్రి విచారణ చేయాలని డిమాండ్



విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం విమానాశ్రయంలో ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) అందుబాటులో లేకపోవడంతో వారం రోజులుగా విమానాలు ఆలస్యం అవుతున్నాయి. మంగళవారం రాత్రి అయితే మూడు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. అందులో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రయాణిస్తున్న విమానం కూడా ఉండడం గమనార్హం.

శీతాకాలం కావడంతో ఉదయం, రాత్రి వేళల్లో మంచు అధికంగా ఉంటోంది. దాంతో విమాన పైలట్లకు రన్‌వే కనిపించడం లేదు. ల్యాండింగ్‌కు కనీసం రెండు వేల మీటర్ల విజుబులిటీ ఉండాలి. కానీ 500 మీటర్లకు పడిపోతున్నది. దాంతో విమానాలను ల్యాండింగ్ చేయడం కష్టమని, మంచు పూర్తిగా తొలగిపోయాక రావాలని ఇక్కడి అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటలలోపు రావలసినవి ఆలస్యంగా బయలుదేరి వస్తున్నాయి. మంగళవారం రాత్రి అల్పపీడనం ప్రభావంతో కొంత గాలులు వీయడం, వాతావరణం సహకరించకపోవడంతో ఢిల్లీ నుంచి విశాఖ రావలసిన విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలించారు. విశాఖపట్నం డాక్‌యార్డులో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక కమిషనింగ్‌కు ముఖ్య అతిథిగా రావలసిన కేంద్ర రక్షణ శాఖా సహాయ మంత్రి సంజయ్ సేథ్ అందులో ఉన్నారు. ఆయన రాత్రికి హైదరాబాద్‌లో ఉండిపోయి ఉదయం తొమ్మిది గంటల తరువాత బయలుదేరి వచ్చారు. దాంతో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కావలసిన కార్యక్రమం మధ్యాహ్నం మొదలైంది. అలాగే మంగళవారం రాత్రి విజయవాడ, హైదరాబాద్‌ల నుంచి రావలసిన విమానాలు తిరిగి వెళ్లిపోయాయి. బుధవారం ఉదయం మరో మూడు విమానాలు ఆలస్యంగా వచ్చాయి.

విచారణకు ఎమ్మెల్యే విష్ణు డిమాండ్

వాతావరణం బాగుండకపోయినా ఐఎల్ఎస్ ద్వారా విమానాలను ల్యాండింగ్ చేయవచ్చు. అయితే ఐఎల్ఎస్‌ను నేవీ అధికారులు ఆపరేట్ చేయకపోవడం వల్ల విమాన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఒకరోజు రెండు రోజులు అయితే ఫరవాలేదు. కానీ వచ్చే ఏడాది జూన్ వరకు ఐఎల్ఎస్ పనిచేయదని చెబుతున్నారు. అంటే అప్పటివరకూ విమానాలు రద్దు, ఆలస్యం తప్పదు. విశాఖ విమానాశ్రయంలో ప్రయాణం కష్టమని దేశం మొత్తం తెలిసేలా చేయడానికే ఇలాంటి పనులు చేస్తున్నారని అనుమానంగా ఉందని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. ఎన్నడూ లేనిది ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం సిద్ధం అవుతున్న తరుణంలో ఇలా చేయడంపై అనుమానాలు ఉన్నాయని, దీనిపై కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అప్పన్న సన్నిధిలో కేంద్ర మంత్రి



సింహాచలం దేవస్థానంలో కప్ప స్తంభం వద్ద కేంద్ర సహాయ మంత్రి సంజయ్ సేథ్ దంపతులు

సింహాచలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ దంపతులు బుధవారం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రికి దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ నక్కాన ఆనందకుమార్‌లు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల అనంతరం ఆలయ వేదపండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, మంత్రిని అధికారులు శాలువాతో సత్కరించి, స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

అధికారుల తప్పులు, విద్యార్థుల తిప్పలు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏయూ ఎగ్జామినేషన్ సెక్షన్ అధికారులు/సిబ్బంది

- పరీక్షల్లో ఒక సబ్జెక్టుకు బదులు వేరొక సబ్జెక్టు ప్రశ్నపత్రాలు
- గతంలోనూ అనేక సందర్భాల్లో మారిన ప్రశ్నపత్రాలు
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. కొద్దిరోజుల కిందట నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఒక సబ్జెక్టుకు బదులు మరో సబ్జెక్టు పేపర్ ఇవ్వడంతో వందలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో వర్సిటీ ఉన్నతాధికారులు పరీక్షను రద్దు చేశారు. ఎగ్జామినేషన్ సెక్షన్ అధికారుల నిర్లక్ష్యమే అందుకు కారణమని వెల్లడైంది. పరీక్ష పేపర్లు వర్సిటీ నుంచి బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తప్పులు దొర్లుతున్నాయి.

ప్రక్రియలో లోపంతోనే సమస్య

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణ బాధ్యత ఎగ్జామినేషన్ సెక్షన్ చూసుకోవాలి. ఇందుకోసం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నేతృత్వంలో ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, మరో డిప్యూటీ రిజిస్ట్రార్‌తోపాటు పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నారు. ప్రశ్నపత్రాలు ... మిగతా 6వ పేజీలో

టీడీఆర్‌లు ఇప్పించండి



గంటాకు వినతిపత్రం అందజేస్తున్న రేవళ్లపాలెం గ్రామస్థులు

కొమ్మాది, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పేరుతో తమకు టీడీఆర్ ఇస్తామని చెప్పి అధికారులు ఇంతవరకు ఇవ్వలేదని ఆరో వార్డులోని రేవళ్లపాలెం గ్రామస్థులుభీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మొరపెట్టుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో మధురవాడ పైవంతెన కూడలి నుంచి రేవళ్లపాలెం మీదుగా నవోదయ వరకు మాస్టర్ ప్లాన్ రహదారి అభివృద్ధి చేసే క్రమంలో రేవళ్లపాలెంలో అడ్డుగా ఉన్న ఇళ్లకు టీడీఆర్ ఇస్తామని చెప్పి తమ ఇళ్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇంతవరకు తమకు టీడీఆర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. తమకు వెంటనేటీడీఆర్‌లు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

దీనిపై గంటా మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వైష్ణవాలయాల్లో తిరుప్పావై పూజలు

మధురవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) ధనుర్మాసం ప్రారంభం కావడంతో మధురవాడ పరిసరాల్లోని వైష్ణవాలయాల్లో వేకువజామున తిరుప్పావై పాశురాలతో స్వామివారిని మేల్కొలుపుతున్నారు. మిథిలాపురి వుడాకాలనీ కొండపై ఉన్న వేంకటేశ్వరాలయం, నగరంపాలెం రోడ్డులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో ధనుర్మాస పూజలు విశేషంగా జరుగుతున్నాయి. ధనుర్మాసం 30 రోజులు 30 పాశురాలతో స్వామివారిని మేల్కొలిపి పూజలు చేస్తారు.భోగి పండుగ రోజున గోదాదేవి కల్యాణాన్ని ఆలయాల్లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

6వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డులో బుధవారం విశాఖపట్నం పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాలను సేకరించారు. పీఎం పాలెం, లక్ష్మీవానిపాలెం, గాయత్రినగర్‌లో సభ్యత్వాలను నమోదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, బూత్ ఇన్‌చార్జ్‌లు కొల్లి బాబ్జీ, కుప్పాక రామకృష్ణ, పోతిన రమణ, కొరగంజి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు జనసేన నాయకులు కంచాలు, కుర్చీల బహూకరణ

పద్మనాభం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేవిడి పంచాయతీ పరిధి రౌతులపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు స్థానిక జనసేన నాయకులు మజ్జి రమేష్, సురేష్‌లు మధ్యాహ్న భోజనానికి అవసరమైన 31 కంచాలు, 4 కుర్చీలను బుధవారం బహూకరించారు. వీటిని ఉపాధ్యాయినులు ధనలక్ష్మి, సంతోషి, పాఠశాల కమిటీ ఛైర్మన్ కంది సత్యనారాయణ సమక్షంలో అందజేశారు. వారికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

నేడు దివ్యాంగుల గుర్తింపు

పద్మనాభం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల సంక్షేమశాఖ, ఐడీబీఐ బ్యాంకు సంయుక్తంగా ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

బుడ్డివలస అగ్రహారంలో 23 వినతులు



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

పద్మనాభం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డివలస అగ్రహారంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 23 వినతులు వచ్చాయి. వీటిలో కుల ధ్రువీకరణ కోసం 15, మ్యుటేషన్‌కు 3, సబ్ డివిజన్ కోసం 4, 22-ఎ కోసం ఒకటి వినతులను అధికారులు స్వీకరించారు. ఈ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సర్వేలో సమస్యలు, ఇతర సేవలను ఉచితంగా పొందవచ్చని తహసీల్దారు కె.ఆనందరావు చెప్పారు. డీటీ చంద్రశేఖర్, ఆర్‌ఐ శ్యామల, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో స్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్లు

భీమునిపట్నం (రూరల్) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం నగరపాలెం గ్రామ పరిధిలోని గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల విన్నపాలు మన్నించి రహదారుల నిర్మాణం చేపట్టారని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయ ని, ఇవి పూర్త యితే రాకపోకలకు ఎలాంటి ఆటంకం ఉండదన్నారు.



కొత్తగా మన భీమిలి

- జీసస్ పార్కులో భారీ లోగో
- వ్యూ పాయింట్‌పై స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు

భీమునిపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన భీమిలి బీచ్ రోడ్డులో మహా విశాఖ నగర పాలక సంస్థ 'మన భీమిలి' అనే పెద్ద అక్షరాలతో ముఖద్వారం (లోగో) ఏర్పాటు చేస్తోంది. ఈ రోడ్డులో సరస్వతి సమాజంకు ఆనుకుని ఉన్న జీసస్ పార్కులో ఈ భారీ లోగోను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం కొత్త కళను సంతరించుకొంది.

ఈ విషయమై జోన్-1 పబ్లిక్ వర్క్స్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ.. రూ.90 వేల జీవీఎంసీ నిధులతో ఈ యాంబ్లమ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ వ్యూ పాయింట్‌ను ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. ఈ యాంబ్లమ్ ముందు భాగంలో ప్లాట్‌పారం నిర్మిస్తున్నామని, ఆ ప్లాట్‌పారంపై పర్యాటకులు నిల్చుని సెల్ఫీలు తీసుకోవచ్చన్నారు.



జీవీఎంసీ ఏర్పాటు చేస్తున్న 'మన భీమిలి' లోగో

స్థానికుల అసంతృప్తి

కాగా, కొత్తగా ఏర్పాటు చేసిన 'మన భీమిలి' యాంబ్లమ్ బాగుందని, అయితే దీన్ని సముద్రతీరంలో రిటర్నింగ్ వాల్, పాత్ వేల వద్ద ఏర్పాటు చేస్తే మరింత బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. భీమిలికి వచ్చే పర్యాటకులు బీచ్ అందాలకు వీక్షించేందుకు వస్తుంటారని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన యాంబ్లయ్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నా సముద్రం, కెరటాలు వంటివి కనిపించే ఆస్కారం లేదని అభిప్రాయ పడుతున్నారు. అంతగా ఈ వ్యూ పాయింట్ సరిగా లేదని అంటున్నారు. అందువల్ల అధికారులు ఈ వ్యూ పాయింట్ ఎంపిక చేసిన స్థలాన్ని పునరాలోచించాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా క్రిస్మస్ అలంకరణ సామగ్రి విక్రయాలు

మధురవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలకు మధురవాడ పరిసరాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే పీఎం పాలెం, మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ రాకకు గుర్తుగా స్టార్స్‌లను చర్చిలపై ఏర్పాటు చేశారు. క్రిస్మస్ వేడుకలకు ఉపయోగించే శాంతాక్లాజ్ మాస్కులు, క్రిస్మస్ ట్రీలు, స్టార్స్, పిల్లలకు శాంతాక్లాజ్ ఇచ్చే బహుమతుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇందుకోసం మధురవాడ, పీఎం పాలెం పరిసరాల్లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసారు.వీటిలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న భీమిలికి చెందిన దల్లి లక్ష్మి(55)కి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.25 లక్షలు సహాయం మంజూరైంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం బాధితురాలి భర్త పాపునాయుడుకు ఈ చెక్‌ను నగరంలోని తన నివాసంలో అందించారు.

సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు

సాగర్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ స్వర్ణభారతినగర్‌లో పదేళ్లుగా నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్టు ఎండాడ మాజీ సర్పంచ్ చెన్నాదాసు తెలిపారు. నిధుల లేమి కారణంగా గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ భవనంప్రజలకు అక్కరకు రాకుండా పోతుండటంతో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మోపిదేవి వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు, మోపిదేవి వెంకటరమణ రూ.20 లక్షల మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరు చేయడంపై రుషికొండ, స్వర్ణభారతినగర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపినట్టు చెన్నా దాసు తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

ఎండాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారం నేపథ్యంలో రైతులు వీలైనంత వరకు వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. నూర్పు అయిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలలో ఉంచాలని, అవసరమైన చోట రైతులకు టార్పలిన్స్ అందజేసి వ్యవసాయ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇంత వరకు 10 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 376 మంది రైతుల నుంచి 2028.24 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.4.34 కోట్లు రైతులకు చెందిన ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు.

మహిళా వివక్షపై అవగాహన సదస్సు

తగరపువలస, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళా వివక్షపై విద్యార్థులకు తెలియజేసేందుకు తగరపువలసలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 'నయాచేతన' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మహిళల అక్రమ రవాణా, మహిళా హత్యలు, బాల్య వివాహాల వల్ల ఇబ్బందులు అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అధ్యాపకులు వివిధ అంశాలను తెలియజేశారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

'చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రభుత్వ స్థలమే'

తగరపువలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా చిట్టివలస జూట్‌మిల్లు ఆస్తిగా భావిస్తున్న ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రభుత్వానిదిగా అధికారులు నిర్ధారించడంతో ఈ స్థలం అమ్మకాలకు బ్రేకు పడింది. ఇందులో సామాజిక భవనం, కల్యాణ మండపం, పెట్రోల్ బంక్ వంటి నిర్మాణాలు చేపట్టి జూట్‌మిల్లు తన ఆధీనంలో ఉంచుకుంది. మిల్లు మూత పడడంతో దీని ఆస్తులను ఒక్కొక్కటి అమ్మేస్తున్నారు. కార్మిక సంఘాల నాయకులు వీటిని నిషేధించాలని కోరుతున్నా చాలా స్థలాల్లో భవన నిర్మాణాలు తొలగించి అమ్మకాలకు అనుకూలంగా చేశారు. తగరపువలసకు చెందిన పలువురు నాయకులు ఈ స్థలం ప్రభుత్వానిదని ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి జూట్‌మిల్లు ఆస్తిగా చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలియజేశారు. ఇటీవల చిట్టివలసలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా కొంతమంది ఈ స్థలం గురించి రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తహసీల్దారు పి.రామారావు ఈ స్థలం ప్రభుత్వానిదేనని బహిరంగంగా ప్రకటించారు. దీంతో ఈ స్థలానికి సంబంధించి లోపాయికారీ లావాదేవీలన్నీ ఆగిపోయినట్లు తెలిసింది. జూట్‌మిల్లు ఈ ప్రాంతంలో స్థాపించిన సమయంలో చాలా భూములను లీజుకు తీసుకున్నారు. లీజు గడువు కొన్నింటికి పూర్తయింది. వందేళ్ల క్రితం నాటి వ్యవహారం కావడంతో చాలామంది వద్ద రికార్డులు లేక జూట్‌మిల్లు యాజమాన్యం చాలా భూములను తన ఆస్తులుగా చూపిస్తూ విక్రయిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకుని తగరపువలస కూడలి ప్రాంతంలో ఉన్న ఈ ఆరు ఎకరాల విలువైన స్థలం రూ.100 కోట్లకు పైగా ధర పలుకుతోంది. కొంతమంది వ్యాపారవేత్తలు ఈ ప్రాంతంలో షాపింగ్‌మాల్ ఏర్పాటు చేయడానికి జూట్‌మిల్లు వద్ద చౌకగా కొనుగోలు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పుడు ఈ స్థలం ప్రభుత్వానిదిగా నిర్ధారణ కావడంతో ఈ వ్యవహారానికి చెక్ పడిందని అంటున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేసి, ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.



తగరపువలస-చిట్టివలస మధ్య ఉన్న ఫుట్‌బాల్ గ్రౌండ్

మిజోరామ్‌కు గీతం సరికొత్త టెక్నాలజీ

సాగర్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడుగునా అధిక తేమ వాతావరణంతో ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో ఉద్యాన పంటలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. హైబ్రిడ్ సోలార్ డిహైడ్రేటర్ పేరిట రూపొందించిన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మిజోరామ్ రాష్ట్ర ఉద్యానవన శాఖ మంత్రి ప్రొఫెసర్ లాల్‌నిలావ్‌మాకు జి-టెక్ కో-ఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు ఇటీవల జరిగిన కార్యక్రమంలో అందజేశారు. జి-టెక్ నిపుణులు డాక్టర్ కె.వి.వి.ఎన్.ఆర్.చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జి-టెక్ అధికారి సోంబట్ శాస్త్రి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారు. పగటి పూట సూర్యరశ్మిని గ్రహించి సౌరశక్తిని నిల్వచేసి రాత్రి సమయంలో తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షించే పరిజ్ఞానం ఉపయోగించినట్లు వారు తెలిపారు. మంత్రి ప్రొఫెసర్ లాల్‌నిలావ్‌మా గీతం నిపుణుల మేధో సహకారాన్ని అభినందించారు. మిజోరామ్ గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు తనను కలసిన గీతం నిపుణుల బృందం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం విశేషాలను అడిగి తెలుసుకున్నారు. గీతం ప్రొఫెసర్లు పలువురు పాల్గొన్నారు.



మిజోరామ్ మంత్రి లాల్‌నిలావ్‌మాకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న డీన్ రాజాఫణిపప్పు

వేధింపులకు వ్యతిరేకంగా ర్యాలీ



కోరాడలో బాలికల ర్యాలీ

పద్మనాభం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరాడ గ్రామంలో బుధవారం సెర్ప్, వెలుగు, ఆర్.వైఎస్.ఎస్. సంస్థలు సంయుక్తంగా లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాయి. బాలలను, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, మహిళల అక్రమ రవాణా, బాల్యవివాహాల నిరోధం, పిల్లలకు నిరంతర విద్య ప్రాముఖ్యతను వివరించారు. చట్టపరమైన రక్షణ గురించి అవగాహన కల్పించేందుకు నిర్భయ చట్టంలో నియమ, నిబంధనలను మహిళలకు వివరించారు. సెర్ప్, వెలుగు, ఆర్.వై.ఆర్.ఎస్. సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు నినాదాలు చేశారు.

అప్పన్న సన్నిధిలో తిరుప్పావై పాశుర విన్నపాలు

సింహాచలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని మూడో పాశురాన్ని బుధవారం పండితులు విన్నపాలు కావించారు. వేకువజామున ప్రభాతారాధనల తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. నాదస్వర విద్వాంసుల వాయిద్యాలు, అధ్యాపకుల వేదపఠనాల నడుమ బేడామండప తిరువీధి జరిపారు. గోదాదేవి అమ్మవారి ఆలయంలో స్థానాచార్యులు డా.టి.పి. రాజగోపాల్ స్వీయ పర్యవేక్షణలో అధ్యాపకులు తిరుప్పావై పాశురాన్ని రాగయుక్తంగా ఆలపించి విన్నపాలు కావించారు. ఆస్థాన మండపంలో సేవాకాలం జరిపి తీర్థగోష్ఠి నిర్వహించారు.



మాంగల్యాన్ని చూపుతున్న అర్చకస్వాములు

కమనీయం అప్పన్న నిత్యకల్యాణం

వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. దానిలో భాగంగా ఉషఃకాలంలో సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, భూ, నీలాదేవిలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. దేవస్థానం నిర్ణయించిన రూ.1000 టికెటు తీసుకుని ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. ఆగమోక్తంగా కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణలు చేసి అక్షితారోపణ(తలంబ్రాలు) జరిపి స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అద్దె భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- 20 ఏళ్లుగా ఇరుకు భవనంలోనే కార్యకలాపాలు
- కార్యరూపం దాల్చని సొంత భవనం ప్రతిపాదన



మిథిలాపురి కాలనీ రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ భవనం

మధురవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థిరాస్థుల క్రయవిక్రయాలతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం అందించే మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత గూడు లేదు. సుమారు 20 సంవత్సరాలు నుంచి మధురవాడలోని మిథిలాపురి వుడాకాలనీలో అద్దె భవనంలో ఈ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి విస్తృతంగా ఉండడంతో పదుల సంఖ్యలో క్రయవిక్రయదారులు వస్తుంటారు. మంచి ముహూర్తాలు ఉన్న రోజుల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ భవనం బాగా ఇరుకుగా ఉండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధిక రిజిస్ట్రేషన్లు ఉన్న సమయంలో భూ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కనీస సదుపాయాలు లేకపోవడంతో వారంతా కార్యాలయ ప్రాంగణంలోనిచిన్న స్థలంలో వేచి ఉండాల్సి వస్తోంది. అక్కడ స్థలం సరిపోకపోవడంతో మిగతా వారంతా రోడ్డుపైనే కాలయాపన చేయాల్సి వస్తోం ది.ఆ సమయంలో అక్కడ ఉన్న చెట్ల నీడలోనే వారంతా వేచి ఉండాల్సిన పరిస్థితి.

ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంతభవనం నిర్మించడానికి సుమారు ఆరు సంవత్సరాలు కిందట మధురవాడ రైతుబజారు సమీపంలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. అయితే ఆ ప్రతిపాదన ఆచరణ రూపం దాల్చలేదు. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల తప్పులు, విద్యార్థుల తిప్పలు

... 5వ పేజీ తరువాయి

ప్రింటయిన తరువాత తొలుత ఏ1 సెక్షన్‌కు అక్కడి నుంచి ఎగ్జామినేషన్ సెక్షన్‌కు వస్తాయి. అక్కడ పేపర్లను సబ్జెక్టుల వారీగా వేరు చేసి కళాశాలలకు పంపిస్తారు.

పేపర్లను ఎగ్జామినే షన్ సెక్షన్ అధికారులు ప్రత్యేకంగా డిజైన్ చేయించిన కవర్స్‌లో ప్యాకింగ్ చేయిస్తారు. ఆ కవర్‌పై సబ్జెక్టు, తేదీ, కాలేజీ వివరాలు, ఎన్ని పేపర్లు అన్నది పేర్కొంటారు. పేపర్లు ఉంచిన కవర్లపై కోడ్‌లు ఉంటాయి. సబ్జెక్ట్ కోడ్‌లు అన్నీ ఒక దగ్గర, కాలేజీ కోడ్‌లు అన్నీ వేరుగా వేయాల్సి ఉంటుంది. కానీ, ఈ ప్రక్రియను అధి కారులు సక్రమంగా చేయడం లేదని, దీనివల్ల ఒక కళాశాలకు వెళ్లాల్సిన పేపర్లు మరో కళాశాలకు వెళుతున్నాయనిచెబుతున్నారు. ప్రతి కవర్‌పైనా పరీక్షకు సంబంధించిన సమా చారం పక్కాగా ఉంటుంది. ఆ సమాచారాన్ని సరిగ్గా చూస్తే ఎటువంటి తప్పులూ జరగవు. కానీ, అందుకు సిబ్బంది సమయాన్ని వెచ్చిం చడం లేదని, అందుకే తప్పులు జరుగుతు న్నాయని చెబుతున్నారు. ఈ సెక్షన్‌పై ఉన్నతాధి కారులు దృష్టిసారించి భవిష్యత్తులో తప్పులు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

స్థలం అన్యాక్రాంతంపై కదిలిన యంత్రాంగం

... 5వ పేజీ తరువాయి

చేస్తుండడంపై 'మహా నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' బుధవారం కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ స్పందించారు. తక్షణం ఆ స్థలానికి సంబంధించిన పూర్తివివరాలతో తనకు నివేదిక సమర్పించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కూడా స్పందించి టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆ స్థలానికి సంబంధించిన కోర్టు కేసులు, ఇతర వివరాలు తీసుకురావాలని ఆదేశించారు.టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఆ స్థలాన్ని పరిరక్షించుకోవడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. కో-ఆపరేటివ్ సొసైటీ లేఅవుట్‌లో రిజర్వు స్థలాలుగా మార్క్ చేసిన నాలుగు స్థలాల్లో రెండు ఇప్పటికీ జీవీఎంసీ ఆధీనంలోనే ఉన్నాయని, మరో రెండింటిపై వివాదం నడుస్తున్నట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు వివరించినట్టు తెలిసింది. కోణార్క్ లాడ్జి వెనుక ఉన్న స్థలంలో భవన ని ర్మాణానికి అనుమతి కోరుతు ఇప్పటికి రెండుసార్లు దరఖాస్తు చేశారని, ఆ స్థలంపై వివాదం ఉండడంతో ప్లాన్ జారీ చేయకుండా తిరస్కరించినట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు కమిషనర్‌కువివరించారు.

భూముల విలువ సవరణకు కసరత్తు

... 5వ పేజీ తరువాయి

రావడంతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జీవీఎంసీ కమిషనర్, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ప్రాథమిక సమావేశం నిర్వహించామన్నారు.

మార్కెట్ విలువలను ప్రాథమికంగా సేకరించిన వివరాల ప్రకారం రెండు రోజుల్లో క్రోడీకరించి, 20వ తేదీన ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామన్నారు. వీటిపై ప్రజల నుంచి 24వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, ఆ తరువాత వాటిని 26వ తేదీన పరిశీలించి, తుది నివేదికను 27న ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త విలువలు అమలులోకి వస్తాయన్నారు.

డెయిరీలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

అంగీకరించలేదు. ప్రస్తుతం డెయిరీలో ఉన్న యూనియన్... యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదని వారితో కలసి తాము చర్చించబోమని నాయకులు స్పష్టం చేయడంతో ఆనంద్‌కుమార్ వెళ్లిపోయారు. దీంతో ఆందోళన చేస్తున్న కార్మికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసి డెయిరీలో గల కార్మికులంతా విధులను బహిష్కరించారు. దీంతో యాజమాన్యం దిగివచ్చింది. మరోమారు చర్చలకు సిద్ధమైంది. ఈ చర్చలలో పలు డిమాండ్లను నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాలను కార్మిక నాయకులు వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60కి పెంచడంతో పాటు పీఆర్‌సీలో భాగంగా 7 శాతం ఐఆర్ ఈ నెల నుంచి అమలు చేసేందుకు, తరువాత వేతన సవరణలో మరింత పెంపునకు యాజమాన్యం అంగీకరించినట్టు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు సీనియారిటీ ప్రాతిపదికన 16 వేల నుంచి 19 వేల రూపాయలు వేతనం చెల్లించడంతో పాటు సెలవుల మంజూరుకు, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఇక ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులను సీనియారిటీ ప్రాతిపదికన ఏడాదికి 25 శాతం చొప్పున వచ్చే జనవరి 1 నుంచి పర్మినెంట్ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని ప్రకటించారు. ఈ చర్చలలో డెయిరీ ఎండీ ఎస్వి ర మణ, జీఎం విజయారావు, కార్మిక నాయకులు ఎ.రమణ, ఎం.రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.



చర్చల అనంతరం మాట్లాడుతున్న కార్మిక నాయకులు

వివాదాస్పద స్థలానికి టీడీఆర్!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం కోసం అనుమతులు పొందారు. ఆ భవన నిర్మాణం చేపట్టాలనుకున్న స్థలాన్ని ఆనుకుని ద్వారకానగర్ నుంచి డైమండ్ పార్కు మీదుగా శంకరమఠానికి వెళ్లే రోడ్డును భవిష్యత్తులో విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచినందున అందుకు అవసరమైన స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించాలని ప్లాన్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తిని అధికారులు కోరారు. దీనికి ఆయన సమ్మతించడంతోపాటు జీవీఎంసీ చేపట్టిన ఆర్‌డీపీ ప్రకారం రోడ్డు విస్తరణకు అవసరమైన 124.41 గజాల స్థలాన్ని 2023 జూన్‌లో అప్పగించడం, ఆ వెంటనే 124.41 గజాల స్థలానికి నాలుగు రెట్లు ఎక్కువ (సుమారు 500 గజాలు) టీడీఆర్ బాండ్ (1086/00108/టీడీఆర్/ఏఎల్‌డబ్ల్యూ/2023) జారీచేయడం జరిగిపోయాయి. ప్రస్తుతం డైమండ్ పార్కు వద్ద రిజిస్ట్రేషన్ విలువ గజం రూ.1.05 లక్షలు ఉంది. అంటే దాదాపు రూ.ఐదు కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌ను జీవీఎంసీ ఇచ్చేసింది. టీడీఆర్ జారీచేసిన వెంటనే ఆ స్థలాన్ని జీవీఎంసీ స్వాధీనం చేసుకుని రోడ్డు విస్తరించడమో...లేదంటే కంచె వేసి తన స్వాధీనంలో ఉంచుకోవడమో చేయాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ లేకుండా టీడీఆర్ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. మిగిలిన స్థలంలో వాణిజ్య భవనం నిర్మాణానికి అనుమతి పొందిన వ్యక్తి, రోడ్డు విస్తరణ నిమిత్తం జీవీఎంసీకి ఇచ్చిన స్థలాన్ని కూడా కలిపేసుకుని సెట్‌బ్యాక్‌లను విడిచిపెట్టకుండా నిర్మాణం పూర్తిచేసేస్తున్నారంటూ కొందరు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తాత్సారం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై కమిషనర్ దృష్టి సారించాల్సి ఉంది.

☛ సంక్షిప్తంగా..

రోడ్డు ప్రమాదంలో ట్రాలర్ డ్రైవర్‌కు గాయాలు


నుజ్జయిన ట్రాలర్ ముందు భాగం

మద్దిలపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జాతీయరహదారిపై బుధవారం ఉదయం ముందు వెళుతున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ట్రాలర్ ఆ లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలర్ ముందు భాగం పాడైంది. ఈ ప్రమాదం ఎప్పుడూ రద్దీగా ఉండే మద్దిలపాలెం-ఇసుకతోట మధ్య జరగడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదానికి గురైన ట్రాలర్ వాహనం క్యాబిన్‌లో చిక్కుకోవడంతో గాయపడ్డాడు. అతడిని ట్రాఫిక్ పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ వలస కార్మికుల దినం సందర్భంగా స్వాంతన స్వచ్ఛంద సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు విచ్చేశారు. కార్యక్రమంలో స్వాంతన ప్రతినిధి డాక్టర్ అన్ని, ప్రజ్ఞన్‌కుమార్, ఆసరా చారిటబుల్ అధ్యక్షుడు సునీత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భగవద్గీత ఆంగ్ల ప్రవచనాలు


ప్రసంగిస్తున్న సుశీల

మద్దిలపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని వైవీఎస్ ఆడిటోరియంలో బుధవారం వేదాంత ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్ల ప్రవచనాలు అలరించాయి. స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీల భగవద్గీతలోని విభూతియోగంపై ఆంగ్లంలో ప్రసంగించారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆత్మవిద్య అందించడంతో ప్రారంభించిన ఆంగ్ల ప్రవచనాలు ఆధ్యాత్మిక వివరణలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సృష్టికి కారణమైన ఆత్మే శ్రీకృష్ణుడని వివరించారు. నదులు ఏవిధంగా సముద్రంలో ఐక్యమవుతాయో మానవులు తమ ఆత్మలో విలీనమైతేనే పరమాత్మ గురించి తెలుసుకుంటారని బోధించారు. విద్యార్థులు మూడు రకాలుగా ఉంటారని మొదటి రకం అహంకారంతో తమకు తెలిసిన విద్యనే నిజమని, రెండో రకం గురువునే పరీక్షించి విమర్శల చేస్తుంటారు, మూడో రకం విద్యార్థులు భక్తిశ్రద్ధలతో జ్ఞానసముపార్జనకు ప్రాధాన్యమిచ్చి నిజమైన శిష్యులుగా ఉంటారని వివరించారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 38, టమాటా 20, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 48 దొండకాయలు 40, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

రహదారి స్థలం కబ్జా.. మౌనంగా 'ప్లానింగ్'

- వీఎంఆర్డీఏ నిర్ధారించినా.. చర్యలు తీసుకోని జీవీఎంసీ
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న గ్రేటర్ అధికారులు
- చక్రం తిప్పుతున్న సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీ


పిఠాపురం కాలనీలో వివాద స్థలం

మద్దిలపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో రోడ్డుపై చిరు వ్యాపారాలు నిర్వహించుకునే తోపుడు బండ్లను ధ్వంసం చేసేశారు. అక్కడ మళ్లీ ఎవరూ తోపుడు బండ్లు పెట్టకుండా ప్రతీ రోజు వార్డులో పహారా కాస్తున్నారు. కానీ కోట్ల రూపాయల విలువైన రహదారులు కబ్జా చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రోజుకు రెండు, మూడొందలు సంపాదించి పొట్ట పోసుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కబ్జాదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిఠాపురం కాలనీ వుడా లే అవుట్ (40/ 91) రహదారిని చదును చేసి వారి ఆధీనంలో పెట్టుకున్న ప్రైవేటు వ్యక్తులపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ ఆక్రమణలపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో జోన్-3 టౌన్‌ప్లానింగ్ అధికారులు పలుమార్లు ఆక్రమణలను పరిశీలించారు. అయితే ఎలాంటి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎందుకో మౌనం వహిస్తున్నారు. జోన్-3 ఏసీపీ, సీసీపీ సైతం మూడు దఫాలు ఆక్రమిత రోడ్డును పరిశీలించి టౌన్ సర్వేయర్‌కు సర్వే చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత మిన్నకుండిపోయారు. అయితే ఈ భూ ఆక్రమణల్లో సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ కార్పొరేటర్ మద్దతు ఆమెకు ఉండడంతో అధికారులు కూడా చర్యలకు వెనకడుగు వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కబ్జాపై స్థానికులు ఫిర్యాదు

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో సాయిరాం పార్లర్ వెనుక ఎకరన్నర స్థలంలో ఎల్.పి నంబర్ 40/91లో లే అవుట్ వేశారు. ఇందులో ముప్పై అడుగుల రోడ్డులతో 13 ప్లాట్లు ఉన్నాయి. కాగా, లే అవుట్‌కు రహదారి పక్కన స్థల యజమానులు తమ స్థలం చదును చేసి రోడ్డును కలిపేసుకున్నారు. దీంతో లే అవుట్ ప్లాట్ల యజమానులు జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు పరిశీలించిన వీఎంఆర్డీఏ కమిషనర్.. వుడా లే అవుట్ రోడ్డు స్థలమని నిర్ధారించారు. వెంటనే ఈ స్థలం వుడా లే అవుట్ రోడ్డు అని, ఇక్కడ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. అయితే, జీవీఎంసీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు.

ఓ పక్క సీఎంచంద్రబాబు కబ్జాలు, ఆక్రమణలను సీరియస్‌గా తీసుకుంటున్నారు. కబ్జాకోరులకు 14 ఏళ్ల జైలు శిక్ష, సహకరించని అధికారులకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించినా ఆక్రమణదారులు, వారికి సహకరిస్తున్న అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

12వ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న టీడీపీ నేతలు

ఆరిలోవ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యతేజనగర్‌లో సుమారు రూ.52 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. గంగా గెడ్డ ప్రాంతంలో రక్షణ గోడ, రోడ్డు చేపట్టనున్నట్టు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, సూర్యతేజనగర్ అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి నాగరాజు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

'బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత'


మాట్లాడుతున్న హరివెంకట్

వెంకోజీపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ధరణి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హరివెంకట్ పేర్కొన్నారు. ఏయూలోని సోషల్ వర్క్ విభాగంలో బుధవారం ప్రత్యేక ప్రసంగం నిర్వహించారు. ఈ సందర్భంగా హరివెంకట్ మాట్లాడుతూ చట్టాల అమలులో మరింత పారదర్శకత అవసరమన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు బోధించడం ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో మరింత మెలకువగా ఉండాలన్నారు. బాల నేరస్థులు, కార్మికులు లేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలన్నారు. సమాజ ప్రగతిలో సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.

సోషల్ వర్క్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు విభిన్న రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కోమల్ సలోమి, అబ్రహం, ఆశాకిరణ్, పుష్పలత, శ్యామ్, వేసవిల, శిరీష, అమిత, లక్ష్మణరావు, సూరిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో ఏయూలో జాతీయ సెమినార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు, ఆచార్య ప్రేమానందం తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పొలిటికల్ సైన్స్ విభాగంఆధ్వర్యంలో 'గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల్లో సమాంతర వ్యవస్థల పాత్ర, ప్రాముఖ్యత' అంశంపై రెండు రోజుల నేషనల్ సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు బుధవారం ఆయన కార్యాలయంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెల 10, 11 తేదీల్లో ఈ సెమినార్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు అకడమిక్ డీన్ కె.ఈశ్వరకుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, సదస్సు సహసంచాలకులు డాక్టర్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల తయారీ అభినందనీయం


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ నేతలు

ఆరిలోవ, డిసెంబరు 18 : (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థుల కోసం నిష్ణాతులతో మోడల్ పేపర్లను రూపొందించడం అభినందనీయమని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ రూపొందించిన టెన్త్ మోడల్ పేపర్లను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని విద్యార్థులకు అందజేసి శత శాతం ఉతీర్ణతకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, సీనియర్ నాయకులు బి.జనార్దనరావు, జిల్లా కార్యదర్శులు మహమ్మద్ రీజ్వాన్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు.. పాల్గొన్న డీఈవో ప్రేమ్‌కుమార్

పెదవాల్తేరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి ఉపయోగించి వదిలేసిన ప్లాస్టిక్‌ను మళ్లీ వాడి అనారోగ్యానికి గురి కావద్దని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. బుధవారం ఈస్టు పాయింట్ కాలనీ గల కేడీపీఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం ఉంటుందని, దీనికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతీ భాయి, ఎస్‌ఆర్‌యూ జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రాజమణి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఉపాధ్యాయులు సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

21న పెందుర్తిలో నూర్‌బాషా జనగర్జన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

సీతంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి గుర్తింపు కోసం పోరాటం చేస్తున్న నూర్ బాషా దూదేకుల ముస్లిం సంఘాలు తమ గుర్తింపు కోసం ఈ నెల 21న పెందుర్తి పోర్టు కల్యాణ మండపంలో జనగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దూదేకుల ముస్లిం ఇండియన్ ముస్లిం మైనారిటీ, ఏపీ నూర్ బాషా ముస్లిం సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించి జనగర్జనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు చట్టసభలో తమకూ ప్రాతినిధ్యం కల్పించాలని, దామాసా పద్ధతి ప్రకారం తమకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. జనగర్జన కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, సంఘం ప్రధాన కార్యదర్శి తాడి దేముడు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, ఆహ్వాన కమిటీ చైర్మన్ షేక్ ఖాన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జి పాల్గొన్నారు.

మురికి కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేవిడి గ్రామంలోని రెడ్డికపేటలో కొందరు మురుగునీరు వెళ్లకుండా కాలువపై అక్రమ కట్టడాలు నిర్మించారు. ఈ విషయమై స్థానికులు సోమవారం తహసీల్దార్ కె.ఆనందరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన బుధవారం రెడ్డికపేటలో కాలువను పరిశీలించారు. నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను ఆదేశించారు. మురుగునీరు సవ్యంగా పారేలా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ స్థలాన్ని తక్షణమే సర్వే చేయించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో స్థానికులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ క్వార్టర్స్‌లో చెత్త తొలగింపు


శుభ్రం చేసిన పోలీస్‌క్వార్టర్స్ ఆవరణ

మద్దిలపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని పోలీస్ క్వార్టర్స్‌లో పేరుకు పోయిన చెత్తను పరిశుభ్రం చేశారు. గుట్టలుగా ఉన్న చెత్తను ఎత్తి తరలించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన పోలీస్ క్వార్టర్స్‌లో అపరిశుభ్రత కథనానికి నగర పోలీస్ కమిషనర్ స్పందించి పికెట్ టీంతో క్లీన్ చేయించారు. క్వార్టర్స్ ఆవరణలో పడివున్న చెత్తచెదారాలను పరిశుభ్రం చేశారు.

అంతర్ వర్సిటీల ఫుట్‌బాల్ టోర్నీకి ఏయూ జట్టు


అంతర్ వర్సిటీ పోటీలకు ఎంపికైన ఏయూ ఫుట్‌బాల్ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఏయూ జట్టును బుధవారం ప్రకటించారు. కాలికట్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీలో వి.ప్రమోద్ సత్య దీపక్, లిఖిత్ వడ్డాది, టి.ప్రదీప్, వి.కనకరాజు, బి.శివశంకర్, ఆర్. కృష్ణ, బి.నవీన్‌కుమార్, ఎ.కల్యాణ్‌రామ్, టి.విజయ్ సాగర్, వి.హర్షవర్ధన్, సోము ధనుష్, ఆకుల కిరణ్, యర్రంశెట్టి సాయి మణికంఠ ప్రణీత్, ఎ.లోకేష్‌నాథ్, చెంబు పవన్‌బాబు, పొట్నూరు అవినాష్, ఎస్.పుష్పక వర్ధన్, ఎ.విజయ్‌కుమార్, రౌతు పవన్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తారు. జట్టు కోచ్‌గా డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి వ్యవహరిస్తారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ బుధవారం జట్టు సభ్యులను అభినందించి క్రమశిక్షణ, అంకితభావం, ప్రతిభను ప్రదర్శించి ఆలిండియా వర్సిటీ టోర్నీకి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఏయూ వ్యాయామవిద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే వెలగపూడికి సచివాలయ ఉద్యోగుల వినతి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి బుధవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్రాభివృద్ధి కోసం తాము కష్టపడి పని చేయడానికిసిద్ధంగా ఉన్నామని, ఉద్యోగుల ఆఫీసు పనివేళలు కచ్చితంగా అమలు చేయడమే కాకుండా సాధారణ సెలవులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, తమకు సర్వీస్ రూల్స్‌ను ఇంప్లిమెంట్ చేయాలని, పని ఒత్తిడిని తగ్గించి, పై అధికారుల నుంచి వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, న్యాయంగా రావాల్సిన మూడు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇచ్చి, జూనియర్ అసిస్టెంట్ పే స్కేలు అమలు చేయాలని కోరారు. లక్షా 23 వేల పైగా ఉద్యోగులు కుటుంబాలతో సహా కూటమి ప్రభుత్వం తమకు మంచి చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మానవ వనరుల మంత్రి నారా లోకేష్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లడానికి తగిన కృషి చేయాలని వారు ఎమ్మెల్యేను వినతిపత్రంలో కోరారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వెలగపూడి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో జేఏసీ నేతలు సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్, వెస్లీ, ధనుంజయ్, వరప్రసాద్, కార్తీక్, రాధిక, ఇంగ్రజ, మహాలక్ష్మీ, కృష్ణవేణి, వెంకన్న పాత్రుడు, బండారు శ్రీనివాస్ ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉన్నారు.

ఉపాధి అవకాశాలకు ప్రత్యేక కోర్సులు


ఆఫీస్ అసిస్టెంట్ షిప్ కోర్సు పూర్తి చేసిన తొలి బ్యాచ్ విద్యార్థులు

మద్దిలపాలెం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉపాధి సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్సుల్లో శిక్షణ ఇస్తోందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. కృష్ణా డిగ్రీ కళాశాలలో మూడు నెలల ఆఫీస్ అసిస్టెంట్ షిప్ కోర్సు పూర్తి చేసిన మొదట బ్యాచ్ విద్యార్థులను బుధవారం ఆయన అభినందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తోందన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద చెన్నైకి చెందిన ఈశాంత్ మూడు నెలలు తమ విద్యార్థులు శిక్షణ కల్పించాలన్నారు. ఇటువంటి కోర్సులు చేయడం వల్ల విద్యార్థులకు ఉన్నతమైన ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ట్రైనర్ సుగుణ, కళాశాల అధ్యాపకులు జి.రాజ్‌కుమార్, పి.ఉమామహేశ్వరరావు, కె.రవిబాబు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పెదవాల్తేరు, డిసెంబరు 18 : ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఈస్టు పాయింట్ కాలనీలో గల కేడీపీఎం హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. బోధించిన సిలబస్ గురించి ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమయ ప్రణాళిక పాటిస్తూ, ప్రతి విద్యార్థినీ దృష్టిలో పెట్టుకొని బోధన సాగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతిభాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీహైడ్రేషన్‌పై నిర్లక్ష్యం వద్దు

మహారాణిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొన్నిసార్లు అతిసార వ్యాధి లక్షణాలు కనిపించనప్పటికీ రోగి శరీరంపై జరిగే డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ వహించరాదని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ఎల్ శ్రీధర్, ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు బి.రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో 'ఇండియా డీహైడ్రేషన్ గ్యాప్ ఫర్ నాన్ డయేరియాల్ ఇల్నెనెస్' అంశంపై వైద్య విద్యారులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అనేక మంది డీహైడ్రేషన్‌కు గురి కావడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని హెచ్చరించారు. అతిసారేతర కేసుల్లో శరీరం డీహైడ్రేషన్‌కు గురి కావడాన్ని గుర్తించడం కష్టంగా మారిందని అన్నారు. జ్వరాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌లు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వేడి కారణంగా జరిగే అలసట, బలహీనత తదితర కారణాల వల్ల కూడా శరీరం డీహైడ్రేషన్‌కు గురి అవుతుందని కేఏపీ వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు, నాన్ డయేరియా కేసులలో వాంతులు, నాలుక, కళ్ళు పొడిబారటం, అధికంగా చెమట, శ్వాస తగినంత తీసుకోలేక పోవటం వంటి లక్షణాలతో కూడిన డీహైడ్రేషన్ పట్ల అశ్రద వహిస్తున్నారన్నారు. ఇలాంటపుడు సాధారణ నీరు, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్, ఫ్రూట్ జ్యూస్ ఆధారిత ఎలక్ట్రోలైట్‌లతో కూడి ద్రవాలను తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ప్రమాదాల మలుపు!



బర్మాక్యాంప్ నుంచి ఎన్‌జీజీఓస్ కాలనీ దారిలో మలుపు

మురళీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 49వవార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ సీఐఎస్ఎఫ్ క్వార్టర్సు నుంచి బర్మాక్యాంప్ నివాసాల్ని చేరే మలుపులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 48ఎ బస్సులు తిరిగే మెయిన్ రోడ్డులో వాహనాలు అతి సమీపానికి వచ్చే వరకు మలుపు గుర్తించడమే కష్టంగా మారుతోంది. గెడ్డ మలుపులో వంపులు తిరిగి ఉన్న రోడ్డులో ఎలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు లేవు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డును మాధవధార, ఉడాకాలనీ నుంచి కైలాసపురం, సీతమ్మధార వైపు వెళ్లే ప్రయాణికులు వినియోగిస్తుంటారు. పెద్దసంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు సహా వ్యాపారులు, ఇతరత్రా పనులపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. జీవిఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రోడ్డు ప్రమాదాల్ని నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సర్కిల్‌లో మరో సొబగు



జగదాంబ కూడలిలోని లేపాక్షి సర్కిల్‌లో నందితో ఫౌంటెన్

జగదాంబ కూడలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లేపాక్షి సర్కిల్ కొత్తరూపు సంతరించుకుంది. జీవీఎంసీ రూ.1.5 లక్షల వ్యయంతో చేపట్టిన ఫౌంటెన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఫౌంటెన్‌పైన నంది ప్రతిమ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఫౌంటెన్ వద్ద నందిని పెట్టి పరిశీలించారు. లేపాక్షి నుంచి జగదాంబ వైపు నందిని ఫౌంటెన్‌పై నిలబెట్టడంతో బాటసారుల దృష్టిని ఆకర్షించింది. అయితే సాయంత్రం వర్షం కురవడంతో నంది ప్రతిమను తొలగించారు. ఫౌంటెన్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ నీళ్లు, విద్యుత్ దీప కాంతుల వ్యవస్థ పనులు త్వరలోనే పూర్తి కానున్నట్లు సుందరీకరణ బాధ్య కాంట్రాక్టర్ సంస్థ పనివారు తెలిపారు. కొత్త సంవత్సరానికి (2025) జగదాంబ, లేపాక్షి సర్కిల్‌లో మరో కొత్త హంగు సాకారం కానుంది.

శ్మశాన మార్గం ఆక్రమణ



గేటుకు ఎదురుగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు

జ్ఞానాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసలే ఆ రహదారి కాయగూరల మార్కెట్ కారణంగా చిన్నబోయింది. అంతిమ యాత్రకు చేరుకోవడానికి ఈ రహదారే ఆధారం. కానీ కొంతమంది ప్రధాన ద్వారాన్ని అనుకుని ఉన్న రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. అయినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలను అతిక్రమిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగేలా మూడు దుకాణాలను ఏర్పాటు చేసినా ఎందుకు మౌనం వహించారో తెలియడం లేదని వాపోయారు. తక్షణమే అక్రమ దుకాణాలను తొలగించి శ్మశానవాటికకు మార్గం చూపాలని అధికారులను వారు కోరుతున్నారు.

అంతర్ వర్సిటీల ఫుట్‌బాల్ టోర్నీకి ఏయూ జట్టు



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును బుధవారం ప్రకటించారు. కాలికట్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీలో ఏయూ జట్టుకు వి.ప్రమోద్ సత్య దీపక్, లిఖిత్ వడ్డాది, టి.ప్రదీప్, వి.కనకరాజు, బి.శివశంకర్, ఆర్.కృష్ణ, బి.నవీన్‌కుమార్, ఎ.కల్యాణ్‌రామ్, టి.విజయ్ సాగర్, వి.హర్షవర్ధన్, సోము ధనుష్, ఆకుల కిరణ్, యర్రంశెట్టి సాయి మణికంఠ ప్రణీత్, ఎ.లోకేష్‌నాథ్, చెంబు పవన్‌బాబు, పొట్నూరు అవినాష్, ఎస్.పుష్పక వర్ధన్, ఎ.విజయ్‌కుమార్, రౌతు పవన్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తారు. జట్టు కోచ్‌గా డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ బుధవారం జట్టు సభ్యులను అభినందించారు. క్రమశిక్షణ, అంకితభావం, ప్రతిభను ప్రదర్శించి ఆలిండియా వర్సిటీ టోర్నీకి అర్హత సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, క్రీడా సంఘ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

శోభన్‌బాబుకు సుస్థిర స్థానం



శోభన్‌బాబు విగ్రహం వద్ద కేకు కోస్తున్న అభిమానులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగంలో ఆరడుగుల అందగాడిగా పేరుగాంచిన శోభన్‌బాబుకు సుస్థిర స్థానం ఉందని శోభన్‌బాబు సిటీవైడ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు కనకరాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అన్నారు. డాబాగార్డెన్స్ వద్ద ఉన్న శోభన్‌బాబు కాంస్య విగ్రహానికి బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శోభన్‌బాబు విగ్రహావిష్కరణ చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నివాళులర్పించామన్నారు. శోభన్‌బాబు పేరు సుస్థిరంగా ఉండేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

భారీగా ఆస్తి పన్ను వసూలు



జడ్సీ మల్లయ్యనాయుడుకు చెక్కు అందజేస్తున్న అధికారులు

అల్లిపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలో బుధవారం భారీగా రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను వసూలు చేశారు. 33వ వార్డుకు సంబంధించి వాణిజ్య సముదాయాల నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి, ఆ చెక్కును జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు అందజేశారు. మరిన్ని మొండి బకాయిలను కూడా త్వరితగతిన వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్ఓ అప్పలరాజు, ఆర్ఐ సీతారాం, వార్డు అడ్మిన్ కార్యదర్శి భార్గవ్ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

దక్షిణ నియోజకవర్గంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాలు 20, 21 తేదీల్లో ఏర్పాటు చేస్తున్నట్లు జడ్సీ మల్లయ్యనాయడు తెలిపారు. ఈ నెల 20న 33వ వార్డు నీలమ్మవేపచెట్టు ప్రాంతంలో ఎంజీఎం పాఠశాల వద్ద, 21న పాతపోస్టాఫీసు క్వీన్ మేరీ హైస్కూల్ వద్ద శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

స్కాలర్‌షిప్ టెస్ట్‌లో నిఖిలేష్ ప్రతిభ



నిఖిలేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయప్రకాష్

డాబాగార్డెన్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేదాంత విజ్ఞాన్ సంస్థ నిర్వహించిన మెగా స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్ట్‌లో సెయింట్ అలోషియస్ ఆంగ్లో ఇండియన్ విద్యార్థి వీఎస్ నిఖిలేష్ ప్రతిభ కనబర్చాడు. పదో తరగతి చదువుతున్న నిఖిలేష్ విశాఖ పరిధిలో తొలి ర్యాంకు సాధించగా, ఆలిండియా స్థాయిలో 9వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. బుధవారం సంస్థ ఆ విద్యార్థికి ఫీజు రాయితీతో పాటు బహుమతిని అందజేసింది. ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్, కరస్పాండెంట్ థామస్ పెరుమాలిల్ అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య తనకు అవార్డు, స్కాలర్‌షిప్ ప్రకటన రావడం ఆనందంగా ఉందని నిఖిలేష్ అన్నాడు. ఈ కార్యక్రమంలో ప్రొక్రైటర్ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ప్రచారం

మురళీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాధవధారలో టీడీపీ, జనసేన నాయకుల్ని కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. టీడీపీ 50వవార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, జనసేన నాయకులు శంఖు వెంకటేశ్వరరావులతో మాట్లాడుతూ తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని నాయకులను రఘువర్మ కోరారు.

జగన్ దుర్మార్గ పాలనతో ఇబ్బందులు

▸ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గ పాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. గ్రేటర్ 24, 42, 43, 44, 45 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సును బుధవారం షాదీఖానాలో నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ మద్యం వ్యాపారంలో జగన్మోహన్‌రెడ్డి రూ.30 వేల కోట్లు దోచేశారన్నారు. భవిష్యత్తులో జగన్ పార్టీని కనిపించకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ కనుమరుగైందని చెప్పారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఆయన అసెంబ్లీకి రాకుండా వారి నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేజీహెచ్‌లో బ్రోకర్లు పెరిగిపోయారని, అక్కడికి వైద్యం కోసం వస్తున్న రోగులను దోచుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారన్నారు. ఇలాంటివారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తానే ఆరోగ్యశాఖ మంత్రిని అయితే రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులను సీజ్ చేయించేవాడినన్నారు. నియోజకవర్గంలో ఎవరికైనా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేనివారికి కేంద్ర ప్రభుత్వం రూ.2.50 లక్షలు చెల్లిస్తుందన్నారు. అనంతరం వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రమేష్, జడ్సీ రాము, 42, 43 వార్డుల కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎండీ నజీర్, పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేటి మోహన్, కన్నం వెంకట రమణారావు, కొయిలాడ వెంకటేష్, వాసుపల్లి రాజు, గురుగోవింద్ సింగ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోగి వద్ద డబ్బు గుంజినా బాధ్యులపై చర్య తీసుకోరా?

మహారాణిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోగం నయం చేసుకుందామని గంపెడాశతో కేజీహెచ్‌కు వచ్చిన వారి నుంచి సిబ్బందిలో కొందరు బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కడుపు మండిన బాధితులు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవటంలో కాలయాపన చేస్తున్నారు. ఈ నెలలోనే ముగ్గురు ఉద్యోగులపై లంచాల ఆరోపణలు వచ్చాయి. గైనకాలజీ విభాగంలో ఎమ్ఎన్‌వోగా, ఎఫ్ఎమ్ఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరరావు, కుమారి అనే ఇద్దరు ఉద్యోగులు గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన ఒక రోగి బంధువుల నుంచి ఇటీవల డబ్బు డిమాండ్ చేశారు. రూ.500 వారి చేతిలో పెట్టినా ఇంకా కావాలని ఒత్తిడి చేయటంతో బంధువుల నుంచి ఫోన్ పే ద్వారా డబ్బు తెప్పించుకొని ఈశ్వరరావుకు ఫోన్ పే ద్వారా చెల్లించారు. ఈ వ్యవహారాన్ని స్క్రీన్ షాట్ తీసి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో వారిని గైనకాలజీ నుంచి ఇతర విభాగాలకు మార్చారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌తో విచారణ జరిపించారు. ఆరోపణలు నిజమని తేలినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. లంచం తీసుకున్న ఆరోపణలపై కుమారి అనే ఉద్యోగిని గతంలో రెండుసార్లు సస్పెండ్ అయింది. ఈశ్వరరావు సైతం ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆసుపత్రిలో సీఎస్ఆర్ బ్లాక్ ఏవోటీలో పనిచేస్తున్న రాజబాబు అనే ఉద్యోగి ఇటీవల ఒక రోగి నుంచి డబ్బులు వసూలు చేయటంతో బాధితులు నేరుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సదరు ఉద్యోగిని పిలిచి గట్టిగా మందలించి వదిలేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ వద్ద బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నారని రోగులు ఫిర్యాదు చేసినా చర్యలకు వెనుకాడటంలో ఆంతర్యం అంతుపట్టడం లేదు. దీనివల్ల తప్పుడు సంకేతాలు వెళ్లవా? అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందిస్తారో, లేదో చూడాల్సి ఉంది.

భగవన్నామ స్మరణే మోక్ష మార్గం



మాట్లాడుతున్న అన్నమాచార్య సంస్థ అధ్యక్షురాలు సింగంపల్లి వెంకట విజయలక్ష్మి

అక్కయ్యపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో భగవన్నామ స్మరణే మోక్షమార్గమని వేంకట అన్నమాచార్య సంస్థ అధ్యక్షురాలు సింగంపల్లి వేంకట విజయలక్ష్మి అన్నారు. రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో బుధవారం సంస్థ సభ్యులు సమావేశమయ్యారు. అన్నమాచార్య సంస్థను ఏర్పాటు చేసి 30 మంది సభ్యులతో బృందంగా ఏర్పడి పదేళ్ల నుంచి విశాఖపట్నంతో పాటు హైదరాబాద్, భద్రాచలం, కాకినాడ, వారణాసి, అమెరికా ప్రాంతాల్లో 500 సుందరకాండ పారాయణాలు చేశామన్నారు. స్వామివారి విశిష్టతను ప్రజలకు తెలియజేసి గృహస్తుల నుంచి వచ్చిన కానుకల్లో కొంత వడ్డికాసులవానికి చేర్చాలనే భావనతో రూ. 10 లక్షలు తిరుపతి దేవస్థానానికి విరాళం అందించినట్లు తెలిపారు. తమ శక్తిమేరకు ఏడుకొండల వేంకటేశ్వరుని వైభవాన్ని ప్రపంచ నలుమూలలా చాటి తద్వారా వచ్చే ప్రతి రూపాయిని స్వామి వెంకన్నకు చేరుస్తామన్నారు. ఇప్పటికే తాను రామనామాన్ని రెండు కోట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మూడో రామ కోటి రాస్తున్నట్లు చెప్పారు. తాము విద్యార్థులకు కోలాటం కూడా నేర్పిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని వివిధ ఆలయాల్లో దేవుడి ఉత్సవాల్లో తమ సభ్యులతో కలిసి కోలాటం ఆడుతున్నట్లు పేర్కొన్నారు.

అలరించిన భగవద్గీత ఆంగ్ల ప్రవచనాలు



ప్రసంగిస్తున్న సుశీల

మద్దిలపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని వైవీఎస్ ఆడిటోరియంలో బుధవారం వేదాంత ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్ల ప్రవచనాలు అలరించాయి. స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీల భగవద్గీతలోని విభూతియోగంపై ఆంగ్లంలో ప్రసంగించారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆత్మవిద్య అందించడంతో ప్రారంభించిన ఆంగ్ల ప్రవచనాలు ఆధ్యాత్మిక వివరణలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సృష్టికి కారణమైన ఆత్మే శ్రీకృష్ణుడని వివరించారు. నదులు ఏవిధంగా సముద్రంలో ఐక్యమవుతాయో మానవులు తమ ఆత్మలో విలీనమైతేనే పరమాత్మ గురించి తెలుసుకుంటారని బోధించారు. విద్యార్థులు మూడు రకాలుగా ఉంటారని మొదటి రకం అహంకారంతో తమకు తెలిసిన విద్యనే నిజమని, రెండో రకం గురువునే పరీక్షించి విమర్శల చేస్తుంటారు, మూడో రకం విద్యార్థులు భక్తిశ్రద్ధలతో జ్ఞానసముపార్జనకు ప్రాధాన్యమిచ్చి నిజమైన శిష్యులుగా ఉంటారని వివరించారు.

బర్మా కాందిశీకుల సమస్యలపై రెవెన్యూ మంత్రికి వినతిపత్రం

కంచరపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు బర్మాకాందిశీకుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి గునుపూడి అరుణ్‌బాబు, సభ్యులు బుధవారం వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. బర్మా నుంచి భారత్‌కు వచ్చిన కాందిశీకులకు నగరంలో పలుచోట్ల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఆవాసాలు ఏర్పాటు చేశారన్నారు. తప్పుడు పత్రాలతో అనేక ప్రాంతాల్లో ఈ భూములను కబ్జా చేశారన్నారు. సర్వే చేయించి, ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి భూములకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సంఘం ప్రతినిధులు చెప్పారు.

శ్రీవైభవుని ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు



ఎన్‌జీజీఓస్ కాలనీ గుడిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మురళీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామికి ప్రాతఃకాల అర్చన తర్వాత విశేష భోగం, పాశుర విన్నపం నిర్వహించారు. ఆలయ అర్చకులు శేష స్వామి పూజా హారతులిచ్చారు. మురళీనగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడి ఆలయంలో ధనుర్మాస పూజా ఉత్సవాలకు భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ బండారు ప్రసాద్ తెలిపారు. జనవరి 13 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో బాలలకు ప్రత్యేక ఓపీ, పడకలు



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బాలల హకుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధులు, వైద్యులు

సీతమ్మధార, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల కోసం ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో నెల రోజుల్లోగా ప్రత్యేకంగా ఓపీ విభాగం, పిల్లల కోసం ప్రత్యేకంగా అయిదు పడకలతో వార్డు ఏర్పాటు చేసి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారామ్ సూచనలతో వైద్యుడిని, సిబ్బందిని కేటాయిస్తున్నట్లు కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.మీనాక్షి పేర్కొన్నారు. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో బుధవారం వైద్యులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిక్షణ కమిషన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ మాట్లాడుతూ కంటి ఆసుపత్రిలో వైద్య సేవలు చాలా మెరుగ్గా ఉన్నాయని, అయితే అందిరితో పాటు కాకుండా రద్దీగా ఉన్న సమయంలో కూడా బాలలకు ప్రత్యేకంగా వైద్యం అందించాలని కోరారు. బాలలకు ప్రత్యేక వార్డు, ప్రత్యేక పడకలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.మీనాక్షి త్వరలో బాలలకు అన్ని ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వాణిశ్రీ, జి.ప్రేమలత, పీఎంఓ ఉమాశ్రీనివాస్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు రమణకుమారి, శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, ఐసీపీయూ ప్రతినిధులు ఆనంద్, శకుంతల, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

అధికారుల తప్పులు, విద్యార్థుల తిప్పలు

... 5వ పేజీ తరువాయి

ప్రింటయిన తరువాత తొలుత ఏ1 సెక్షన్‌కు అక్కడి నుంచి ఎగ్జామినేషన్ సెక్షన్‌కు వస్తాయి. అక్కడ పేపర్లను సబ్జెక్టుల వారీగా వేరు చేసి కళాశాలలకు పంపిస్తారు. పేపర్లను ఎగ్జామినేషన్ సెక్షన్ అధికారులు ప్రత్యేకంగా డిజైన్ చేయించిన కవర్స్‌లో ప్యాకింగ్ చేయిస్తారు. ఆ కవర్‌పై సబ్జెక్టు, తేదీ, కాలేజీ వివరాలు, ఎన్ని పేపర్లు అన్నది పేర్కొంటారు. పేపర్లు ఉంచిన కవర్లపై కోడ్‌లు ఉంటాయి. సబ్జెక్ట్ కోడ్‌లు అన్నీ ఒక దగ్గర, కాలేజీ కోడ్‌లు అన్నీ వేరుగా వేయాల్సి ఉంటుంది. కానీ, ఈ ప్రక్రియను అధికారులు సక్రమంగా చేయడం లేదని, దీనివల్ల ఒక కళాశాలకు వెళ్లాల్సిన పేపర్లు మరో కళాశాలకు వెళుతున్నాయని చెబుతున్నారు. ప్రతి కవర్‌పైనా పరీక్షకు సంబంధించిన సమాచారం పక్కాగా ఉంటుంది. ఆ సమాచారాన్ని సరిగ్గా చూస్తే ఎటువంటి తప్పులూ జరగవు. కానీ, అందుకు సిబ్బంది సమయాన్ని వెచ్చించడం లేదని, అందుకే తప్పులు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ సెక్షన్‌పై ఉన్నతాధికారులు దృష్టిసారించి భవిష్యత్తులో తప్పులు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

స్థలం అన్యాక్రాంతంపై కదిలిన యంత్రాంగం

... 5వ పేజీ తరువాయి

చేస్తుండడంపై 'మహా నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' బుధవారం కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ స్పందించారు. తక్షణం ఆ స్థలానికి సంబంధించిన పూర్తివివరాలతో తనకు నివేదిక సమర్పించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కూడా స్పందించి టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆ స్థలానికి సంబంధించిన కోర్టు కేసులు, ఇతర వివరాలు తీసుకురావాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఆ స్థలాన్ని పరిరక్షించుకోవడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. కో-ఆపరేటివ్ సొసైటీ లేఅవుట్‌లో రిజర్వు స్థలాలుగా మార్క్ చేసిన నాలుగు స్థలాల్లో రెండు ఇప్పటికీ జీవీఎంసీ ఆధీనంలోనే ఉన్నాయని, మరో రెండింటిపై వివాదం నడుస్తున్నట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు వివరించినట్టు తెలిసింది. కోణార్క్ లాడ్జి వెనుక ఉన్న స్థలంలో భవన నిర్మాణానికి అనుమతి కోరుతు ఇప్పటికి రెండుసార్లు దరఖాస్తు చేశారని, ఆ స్థలంపై వివాదం ఉండడంతో ప్లాన్ జారీ చేయకుండా తిరస్కరించినట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు.

వివాదాస్పద స్థలానికి టీడీఆర్!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం కోసం అనుమతులు పొందారు. ఆ భవన నిర్మాణం చేపట్టాలనుకున్న స్థలాన్ని ఆనుకుని ద్వారకానగర్ నుంచి డైమండ్ పార్కు మీదుగా శంకరమఠానికి వెళ్లే రోడ్డును భవిష్యత్తులో విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచినందున అందుకు అవసరమైన స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించాలని ప్లాన్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తిని అధికారులు కోరారు. దీనికి ఆయన సమ్మతించడంతోపాటు జీవీఎంసీ చేపట్టిన ఆర్‌డీపీ ప్రకారం రోడ్డు విస్తరణకు అవసరమైన 124.41 గజాల స్థలాన్ని 2023 జూన్‌లో అప్పగించడం, ఆ వెంటనే 124.41 గజాల స్థలానికి నాలుగు రెట్లు ఎక్కువ (సుమారు 500 గజాలు) టీడీఆర్ బాండ్ (1086/00108/టీడీఆర్/ఏఎల్‌డబ్ల్యూ/2023) జారీచేయడం జరిగిపోయాయి. ప్రస్తుతం డైమండ్ పార్కు వద్ద రిజిస్ట్రేషన్ విలువ గజం రూ.1.05 లక్షలు ఉంది. అంటే దాదాపు రూ.ఐదు కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌ను జీవీఎంసీ ఇచ్చేసింది. టీడీఆర్ జారీచేసిన వెంటనే ఆ స్థలాన్ని జీవీఎంసీ స్వాధీనం చేసుకుని రోడ్డు విస్తరించడమో...లేదంటే కంచె వేసి తన స్వాధీనంలో ఉంచుకోవడమో చేయాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ లేకుండా టీడీఆర్ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. మిగిలిన స్థలంలో వాణిజ్య భవనం నిర్మాణానికి అనుమతి పొందిన వ్యక్తి, రోడ్డు విస్తరణ నిమిత్తం జీవీఎంసీకి ఇచ్చిన స్థలాన్ని కూడా కలిపేసుకుని సెట్ బ్యాక్‌లను విడిచిపెట్టకుండా నిర్మాణం పూర్తిచేసేస్తున్నారంటూ కొందరు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తాత్సారం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంది.

భూముల విలువ సవరణకు కసరత్తు

... 5వ పేజీ తరువాయి

రావడంతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జీవీఎంసీ కమిషనర్, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ప్రాథమిక సమావేశం నిర్వహించామన్నారు. మార్కెట్ విలువలను ప్రాథమికంగా సేకరించిన వివరాల ప్రకారం రెండు రోజుల్లో క్రోడీకరించి, 20న ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామన్నారు. వీటిపై ప్రజల నుంచి 24 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటిని 26న పరిశీలించి, తుది నివేదికను 27న ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త విలువలు అమలులోకి వస్తాయన్నారు.

డెయిరీలో ఉద్రిక్తత



చర్చల అనంతరం కార్మికులకు వివరాలు తెలియజేస్తున్న నాయకులు

... 5వ పేజీ తరువాయి

అంగీకరించలేదు. ప్రస్తుతం డెయిరీలో ఉన్న యూనియన్...యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదని వారితో కలసి తాము చర్చించబోమని నాయకులు స్పష్టంచేయడంతో ఆనంద్‌కుమార్ వెళ్లిపోయారు. దీంతో ఆందోళన చేస్తున్న కార్మికులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. ఈ విషయం తెలిసి డెయిరీలో గల కార్మికులంతా విధులను బహిష్కరించారు. దీంతో యాజమాన్యం దిగివచ్చింది. మరోమారు చర్చలకు సిద్ధమైంది. ఈ చర్చలలో పలు డిమాండ్లను నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాలను కార్మిక నాయకులు వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60కి పెంచడంతో పాటు పీఆర్‌సీలో భాగంగా 7 శాతం ఐఆర్ ఈ నెల నుంచి అమలు చేసేందుకు, తరువాత వేతన సవరణలో మరింత పెంపునకు యాజమాన్యం అంగీకరించినట్టు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు సీనియారిటీ ప్రాతిపదికన 16 వేల నుంచి 19 వేల రూపాయలు వేతనం చెల్లించడంతో పాటు సెలవుల మంజూరుకు, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఇక ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులను సీనియారిటీ ప్రాతిపదికన ఏడాదికి 25 శాతం చొప్పున వచ్చే జనవరి 1 నుంచి పర్మినెంట్ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని ప్రకటించారు. ఈ చర్చలలో డెయిరీ ఎండీ ఎస్‌వి రమణ, జీఎం విజయారావు, కార్మిక నాయకులు ఎ.రమణ, ఎం.రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్ నాగరాజు

యూబీఐలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

అగనంపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం బ్రాంచి మేనేజర్ బి. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఇక్కడ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని, ప్రజలంతా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, సూపర్‌వైజర్ ముప్పల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ రోడ్డులో ఆకతాయిల ఆగడాలు

గాజువాక, డిసెంబరు 18: గాజువాక హైస్కూల్ రోడ్డులో ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని పలువురు విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈ రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలు ఉండడంతో విద్యార్థినులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డులో ఉన్న పలు పాన్ షాపులు, టిఫిన్ సెంటర్ల వద్ద ఆకతాయిలు మాటువేసి విద్యార్థినులను వేధిస్తున్నారు. దీనిపై పలువురు విద్యార్థినులు పాఠశాలల ఉపాధ్యాయులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఇప్పటికే ఆకతాయిలకు పోలీసులు హెచ్చరించడం జరిగింది. అయినా వారిలో ఎలాంటి మార్పు లేదు. అందువల్ల ఆకతాయిల ఆగడాలపై పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం

అగనంపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ సిబ్బంది బుధవారం వారపు సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ నినాదాలు చేశారు. 79వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు దుకాణదారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందరూ నార, క్లాత్ సంచులను వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పైడిరాజు, కార్యదర్శి కనకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల ధర్నా వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తలపెట్టిన ఉక్కు ఉద్యోగులు, కుటుంబీకుల ధర్నా వర్షం కారణంగా వాయిదా పడింది. జీతాలు సకాలంలో చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉక్కు ఉద్యోగులు బుధవారం అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు. అయితే వర్షం కారణంగా వాయిదా పడిన ధర్నా తేదీని తర్వాత ప్రకటిస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్‌రావు తెలిపారు.

సినిమా గైడ్

● **పుష్ప-2**: జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 38, టమాటా 20, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 48 దొండకాయలు 40, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరు చిక్కుడు 28 దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ఆఖరి మజిలీకి అండగా..

» పేదలు, అనాథల మృతదేహాలు శాంతి రథం ద్వారా తరలింపు
» అనాథ శవాలకు 'మానవత' దృక్పథంతో అంత్యక్రియలు చేస్తున్న నిర్వాహకులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మన అనుకునే వారికి ఏదైనా జరిగితే ఎంతో బాధపడతాం. అదే మృత్యువాత పడితే ఆ వేదన వర్ణనాతీతం. అంత్యక్రియలు నిర్వహించేందుకు స్వర్గధామాలు ఎక్కడ ఉంటే అక్కడకు తీసుకువెళ్లేందుకు అవస్థలు పడతాం. అంత్యక్రియలను సైతం వ్యాపారంగా మార్చేసిన ప్రైవేటు వ్యవస్థలకు ధీటుగా గాజువాక, కూర్మన్నపాలెంలలో మానవత వాలెంటరీ ఆర్గనైజేషన్‌ను 2022లో నిర్వాహకులు ఏర్పాటు చేసి నిరుపేదలు, అనాథలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఈ సేవా సంస్థ చైర్మన్ దేనంకొండ కృష్ణంరాజు పర్యవేక్షణలో శాంతి రథాన్ని అందుబాటులోకి తెచ్చారు. నలుగురు వ్యక్తులు పాడె మోసుకుని శ్మశానవాటికకు తరలించే పరిస్థితికి బదులు భగవద్గీత శ్లోకాలు, ధైర్యాన్ని నూరిపోసే గీతాలు, భక్తి భావం ఉట్టిపడేలా ఉన్న శాంతి రథం ద్వారా నిర్వాహకులు సేవలందిస్తున్నారు. ఎక్కడైనా అనాథలు, దహన ఖర్చులు భరించలేని పేదలు మృతి చెందితే మానవతా వాలెంటరీ ఆర్గనైజేషన్‌ను సంప్రదిస్తే తక్షణమే అక్కడకు శాంతి రథాన్ని పంపి మృతదేహాలను శ్మశానవాటికకు ఉచితంగా తరలిస్తున్నారు.



అనాథ శవం మెడలో పూలమాల వేస్తున్న మానవత వాలెంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ కృష్ణంరాజు

అనాథల శవాలకు అంత్యక్రియలు కూడా..

మానవత వాలెంటరీ ఆర్గనైజేషన్ అనాథలకు అండగా నిలుస్తోంది. ఎక్కడైనా అనాథలు మృతి చెందినట్టు తెలిస్తే శాంతి రథాన్ని అక్కడకు పంపి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడమే కాకుండా అంత్యక్రియలను కూడా నిర్వహిస్తుంది. అంతేకాక అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఆర్థిక సాయం చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులకు నగదు బహుమతులను అందించడంతో పాటు కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతోంది.

సేవలను బాధ్యతగా భావిస్తాం

-దేనంకొండ కృష్ణంరాజు, మానవత వాలెంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్



మానవత వాలెంటరీ ఆర్గనైజేషన్‌ను ఎస్.రామచంద్రారెడ్డి స్థాపించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 103 యూనిట్లుగా, 52,400 మంది సభ్యులతో ఈ ఆర్గనైజేషన్ విస్తరించింది. గాజువాకలో యూనిట్ ఏర్పాటైన మూడేళ్లలో 36 మంది సభ్యులతో అనాథలు, నిరుపేదలకు సేవలందించడమే బాధ్యతగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటివరకు 323 మంది అంతిమ సంస్కారాలకు వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో ఎనిమిది మంది అనాథ శవాలకు అంత్యక్రియలు కూడా నిర్వహించాం. దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ, కాలుష్య నివారణకు మొక్కలు నాటడం, ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించడంతో పాటు యువతకు కెరీర్ గైడ్ లైన్స్‌ను అందిస్తున్నాం.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జయదేవి

పెదగంట్యాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు, బాలికల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి (పీడీ) డి.జయదేవి కోరారు. సమాజంలో ఇప్పటికీ అక్కడక్కడ బాల్యవివాలు జరుగుతున్నాయని, బాలికల అక్రమ రవాణా జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, వీటిని క్షేత్రస్థాయిలోనే నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నెల్లిముక్కు మునిసిపల్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిషేధ చట్టం అమలుపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజంలో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కిశోర బాలికలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మహిళలు, బాలికల రక్షణకు, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అందరిలో చైతన్యాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై జిల్లా వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని జయదేవి పేర్కొన్నారు.

పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.సీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్ హోల్డ్ మేనేజర్ డేవిడ్ రాజు, ఖాదీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పద్మ, ఎంఈవో కె.రమణాజీ, పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేశ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సుజాత, లక్ష్మి, కలిషా బేగం, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయదేవి

చిత్తడిగా మారిన లోతట్టు ప్రాంతాలు

» మందకొడిగా సాగుతున్న వ్యాపారాలు

గోపాలపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికి గోపాలపట్నం శివారులోని లోతట్టు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. 89వ వార్డులోని సంతోష్‌నగర్ నుంచి వెంకటాపురం గ్రామానికి వెళ్లే రహదారి రైల్వే సమస్య కారణంగా పూర్తిస్థాయిలో నిర్మాణం జరగకపోవడంతో ఎక్కడికక్కడ మట్టి పేరుకుపోయింది. వర్షానికి బురదమయమయింది. ఈ రోడ్డులోని ఐదుమాదాల మార్గం వర్షం దెబ్బకు మరింత దుర్భరంగా మారడంతో వెంకటాపురం గ్రామ ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారుల గగ్గోలు

కాగా పండుగ సీజన్ సమీపించడంతో గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ వస్త్రవ్యాపారం జోరందుకుంది. మంగళవారం నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షానికి వ్యాపారాలు డీలాపడ్డాయి. ముసురు కారణంగా కొనుగోలుదారులు లేక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వర్షాలతో బురదమయంగా మారిన కొత్తపాలెం-వెంకటాపురం రహదారి

బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్ల విక్రయాలు

» డెలివరీ బాయ్స్ చేతివాటం » సహకరిస్తున్న అధికారులు



మల్కాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో వంటగ్యాస్ బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. డెలివరీ బాయ్స్ అక్రమంగా అమ్ముతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. దీనికి ఆయా ఏజెన్సీలు, అధికారులు సహకరిస్తున్నారని చెబుతున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో సిలిండర్లను అమ్మిస్తూ వచ్చిన సొమ్మును పంచుకుంటున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.840 ఉండగా, బ్లాక్‌లో రూ.1250కు విక్రయిస్తున్నారు. ఎక్కువగా టీ, టిఫిన్ దుకాణాలకు వీటిని చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారుడు గ్యాస్ బుక్ చేసిన వారం రోజులు గడచినా సిలిండర్ రాదు. కానీ టీ, టిఫిన్ దుకాణాల నిర్వాహకుల వద్ద రోజుకు రెండు సిలిండర్లు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో హెచ్‌పీ, ఇండేన్ ఏజెన్సీలు ఉన్నాయి, ఈ రెండు ఏజెన్సీలకు వేలలో కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ భారత్ గ్యాస్ ఏజెన్సీ లేకున్నా వినియోగదారులు ఉన్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న వినియోగదారులకు కాకుండా బ్లాక్‌లో విక్రయాలకే డెలివరీ బాయ్స్ మొగ్గుచూపుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు వాణిజ్య సిలిండర్లు వినియోగించాల్సిన దుకాణాల్లో యథేచ్ఛగా గృహావసరాల సిలిండర్లను వాడుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో ఈ అక్రమాల వెనుక పౌరసరఫరాల అధికారుల ప్రమేయం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు కూడా బ్లాక్ విక్రయాలను ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



పెందుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వేంకటాద్రిపై నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేకువ జామున స్వామివారిని మేల్కొలిపి హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులు స్వీకరించారు.

కూలిన చెట్టును తొలగించేదెన్నడో?



బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రం ముందు కూలిన చెట్టు

ఎన్ఏడీజంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం ఎదుట వేపచెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టును పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ప్రహరీగోడ, కాలువ ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

'ఏపీఐఐసీ భూముల్లో ఆక్రమణలను తొలగించండి'

పెందుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికీకరణ నిమిత్తం గుర్రమ్మపాలెంలో ఏపీఐఐసీకి కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలు జరిగాయని సర్పంచి ఉగ్గిన గోవింద, ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతీ నగేశ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. సదస్సులో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామస్థులు వినతి పత్రాలు సమర్పించారు. ఏపీఐఐసీ కేటాయించిన భూముల గురించి సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు ప్రస్తావించారు. ఇక్కడ కొంతమందికి నివేశన స్థలాలు కేటాయించారని, వారికి కేటాయించిన స్థలాలకు మించి ఆక్రమిస్తున్నారని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఆక్రమణలను నివారించాలని కోరారు. రైత్వారీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. భూములలో రీసర్వే చేసి హక్కు పత్రాలను మంజూరు చేయాలని కోరుతూ పలువురు రైతులు ఎఫ్.లైన్ దరఖాస్తులు చేశారు. సదస్సుల్లో దరఖాస్తులను తీసుకుని వెళ్లిపోతే సరికాదని అధికారులు జవాబుదారీ తనం చూపాలని కోరారు. సర్పంచి గోవింద అధ్యక్షతన జరిగిన సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామయ్య, తహసీల్దార్ ఆనందకుమార్, డీటీ శ్రీనివాసరావు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు

శిథిలమైన కల్వర్టుతో ప్రజలకు అవస్థలు



విరాట్‌నగర్ మూడు రోడ్ల మార్గంలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

వేపగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని ప్రహ్లాదపురం దరి విరాట్‌నగర్ లోపల ఉన్న మూడు రోడ్ల కూడలిలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి కల్వర్టు గతంలో భారీ వాహనాల ప్రవేశం కారణంగా శిథిలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు తొమ్మిది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రాత్రివేళ ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును మరమ్మతు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సంతలోకి వెళ్లే మార్గానికి ఇరుపక్కలా ఏర్పాటు చేసిన దుకాణాలు

వారపు సంతలోకి వెళ్లే దారేది!

ఇబ్బందులు పడుతున్న కొనుగోలుదారులు

అగనంపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అగనంపూడిలో ప్రతి బుధవారం జరిగే సంతలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి వారపు సంతలోకి వెళ్లే మార్గంలో వ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకు రెండు వైపులా దుకాణాలు నెలకొల్పుతున్నారు. ఈ కారణంగా దారి మొత్తం కుదించుకుపోతుంది. ఈ క్రమంలో సంతకు వచ్చే కొనుగోలుదారులు లోపలకు వెళ్లేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఇరుకుమయమైన ఈ దారిలో రాకపోకలు సాగిస్తుండడంతో జేబుదొంగలు చేతివాటాన్ని చూపిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్నాథస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వారపు సంతకు అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే. దీంతో ఎవరికి నచ్చినట్టుగా వారు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతలో సౌకర్యాలను కల్పించాలని పలువురు కోరుతున్నారు.

22 శాతం వృద్ధి సాధించిన వీఎస్ఈజెడ్

జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



కూర్మన్నపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని వీఎస్ఈజెడ్ ద్వారా ఎగుమతులు పెరిగాయని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అర్థ సంవత్సరానికి (ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు) 22 శాతం వృద్ధి సాధించినట్టు జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.1,27,774 కోట్ల మేర వస్తువులను, వస్తు సేవలను ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని రాబట్టినట్టు పేర్కొన్నారు. సేవల ద్వారా రూ.78,376 కోట్లు, వస్తు సేవల ద్వారా రూ.49,368 కోట్లు ఆదాయం సముపార్జినట్టు ఆయన వెల్లడించారు.

జనవరిలోగా స్టీల్‌ప్లాంట్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న కేంద్ర మంత్రి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనవరిలోగా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెడీ కుమారస్వామి తెలిపినట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు (సీపీఎం) డాక్టర్ వి.శివదాసన్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఉక్కు కర్మాగారం సమస్యలపై వినతాపత్రాన్ని అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఉద్యోగులు మానసికంగా కుంగిపోతున్నారని, కొన్ని నెలలుగా ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించక పోగా.. ఉన్న హెచ్‌ఆర్‌ను, ఇతర అలవెన్సులను తొలగించారని మంత్రికి వివరించారు. మూడు నెలలుగా 185 శాతం జీతం పెండింగ్‌లో ఉందని, ఉద్యోగుల పదవీ విరమణ సందర్భంగా చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఫండ్ రూ.300 కోట్లను యాజమాన్యం ఉపసంహరించుకుందన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జి.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు ఉన్నారు. అనంతరం కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్‌రాయ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా జరిపాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, భూ, నీలాదేవిలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు.

నిధులు కేటాయించాలని కమిషనర్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి జ్ఞాపికను బహూకరించి నిధుల విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాజే మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు'

వేపగుంట డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదని సింహాచలం రైల్వే రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు వేదుల నరసింగరావు అన్నారు. సింహాచలం గోశాల సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగి కుటుంబం బాగోగులు చూసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సంఘ అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ కొవిడ్ సమయంలో రైల్వే ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగులుకు రావాల్సిన పాస్, రాయితీలపై పోరాడేందుకు తీర్మానం చేశారు. అంతకుముందు ఎంఆర్‌కే ధర్మారావు కేక్ కట్ చేశారు. సమావేశంలో జీవీ రమణారావు, సాహు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పీఎస్ రావు, రామారావు, రమణరాజు, ఎస్.ఆర్.కె.రాజు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పది కిలోల గంజాయి ఆయిల్ పట్టివేత


పెందుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధి గవరజగ్గయ్యపాలెంలో మంగళవారం రాత్రి పది కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పెందుర్తి పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఆటోలో తరలిస్తున్న పది కిలోల హాష్ (గంజాయి)ఆయిల్‌ను పట్టుకొన్నారు. నిందితులు ముగ్గురిని ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. నిందితులు ముగ్గురు అల్లూరి సీతారామరాజు జిల్లా వాసులని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. వీరిలో ఉల్లంగి రామన్న చింతపల్లి మండలం చీమలాపల్లి, కూడా రవిశంకర్ పాడేరు మండలం పాత పాడేరు గ్రామాలకు చెందిన వారు కాగా బోనంగి చంటిబాబు జీకే వీధి మండలం చీరపల్లి గ్రామస్థుడని వివరించారు.

చేయి కదిపితే చిత్రమే!


పెన్సిల్ చిత్రకళలో రాణిస్తున్న విశ్రాంత ఉద్యోగి పీవీఆర్ మూర్తి

- గీసిన చిత్రాలతో 'మై పెన్సిల్ ఫీట్' పేరుతో పుస్తకావిష్కరణ
- ముదిమి వయసులోనూ తరగని ఉత్సాహం
- ఓపిక ఉన్నంతవరకు ఉచిత శిక్షణ ఇస్తానంటున్న మూర్తి

(డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి)



పెన్సిల్‌తో చిత్రాన్ని గీస్తున్న వెంకటరమణమూర్తి



సీఎం నారా చంద్రబాబు నాయుడు



శ్రీరాముడు

వివిధ సినిమాల్లో ఎన్టీఆర్ వేషధారణ చిత్రాలు

అభిరుచిని సాకారం చేసుకోవాలనే సంకల్పానికి అడ్డు, అసాధ్యం లేదని నిరూపిస్తున్నారు నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పొన్నాడ వెంకటరమణమూర్తి (పీవీఆర్ మూర్తి). ఎనిమిది పదుల వయసులోనూ తనకు ఇష్టమైన చిత్రకళను అద్భుతంగా ప్రదర్శిస్తూ మన్ననలు అందుకుంటున్నారు విద్యార్థి దశలోనే మహాత్మాగాంధీ చిత్రాన్ని గీసి శభాష్ అనిపించుకున్నారు. ఆ తరువాత వీలుదొరికినప్పుడల్లా చిత్రాలు గీస్తూ తన కళాభిరుచిని సజీవం చేశారు. ఓ ప్రైవేటు సంస్థలో సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం తనదైనశైలిలో చిత్రాలు గీస్తూ అబ్బురపరుస్తున్నారు. అలా తాను గీసిన వందలాది చిత్రాలతో రూపొందించిన 'మై పెన్సిల్ ఫీట్' పుస్తకావిష్కరణతోపాటు ఇటీవల నగరంలో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

చార్‌కోల్ పెన్సిల్ ఆర్ట్‌తో పొన్నాడ వెంకటరమణ మూర్తి 81 ఏళ్ల వయసులోనే ఉత్సాహంగా కళాత్మక చిత్రాలకు మెరుగులద్దుతున్నారు. ఉద్యోగం చేస్తున్న సమయంలో వివిధ మ్యాగజైన్లకు కార్టున్లు గీసేవారు. రచయిత్రి సమ్మెట ఉమాదేవి రచించిన అమ్మ కథలు, రచయిత్రి సుజల గంటి రాసిన అమృత వాహిని పుస్తకాలతో పాటు పలు కథలు, నవలల కవర్ పేజీలకు బొమ్మలు గీశారు. తాను గీస్తున్న చిత్రాలను ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడం, అవి విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో రెట్టించిన ఉత్సాహంతో వైవిధ్యంగా రూపమిస్తున్నారు. ఏ రోజుకు ఏ ప్రత్యేకత ఉందో తెలిపేలా చిత్రాలు గీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. ప్రముఖ నటులు, ఆటగాళ్లు, రచయితల పుట్టిన రోజులు, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా వేసిన చిత్రాలు విశేష ఆదరణకు నోచుకున్నాయి.



మదర్ థెరిస్సా



గాంధీ చిత్రం

ప్రముఖులకు చిత్రాల బహూకరణ

ఘంటసాల శత జయంతి ఉత్సవంలో పీవీఆర్ మూర్తి గీసిన చిత్రాలు ప్రముఖంగా కనిపిస్తాయి. హైదరాబాద్‌లో గతంలో జరిగిన ఎం.ఎస్.మ్యూజిక్ అకాడమీ ప్రారంభోత్సవంలో ప్రముఖ గాయకులు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంల చిత్రాలు గీసి వారికే బహూకరించి ప్రశంసలు అందుకున్నారు.



గీసిన చిత్రాన్ని గాయకుడు బాలసుబ్రహ్మణ్యానికి అందజేస్తూ (ఫైల్)

యువతకు ఉచితంగా శిక్షణ

చిత్రాలు గీయడంలో ఉత్సాహం చూపే యువతకు ప్రతిరోజూ సాయంత్రం ఉచిత శిక్షణ ఇస్తున్నా. ఓపిక ఉన్నంతకాలం చిత్రాలు గీస్తూనే ఉంటాను. అనేక రాష్ట్రాలు తిరిగి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకుని వాటికి చిత్రరూపమిచ్చా. మంచి చిత్రాలు వేస్తూ నేటి సమాజాన్ని ఆలోచింపజేయాలన్నదే ధ్యేయం

-పొన్నాడ వెంకటరమణమూర్తి

పోలీస్ అవుట్ పోస్టు సేవలు భేష్: హోం మంత్రి



పోలీస్ అవుట్ పోస్టును సందర్శించిన హోంశాఖ మంత్రి అనిత

పూర్ణామార్కెట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద పోలీస్ అవుట్ పోస్టును హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం సందర్శించారు. వన్‌టౌన్ సీఐ దేముడుబాబు 'మీ కోసం మీ పోలీస్' ద్వారా భక్తులకు అందిస్తున్న సేవలను వివరించారు. భక్తులకు అవుట్ పోస్టు ద్వారా అందిస్తున్న సేవలపై హోం మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

21 నుంచి మహాభారత కథా యజ్ఞం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈ నెల 21 నుంచి 27 వరకు మహాభారత కథా యజ్ఞాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సునీల్ చౌదరి, సమన్వయకర్త సునీల్ బాలాసరియా తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక శిబిరంలో అయోధ్య రామ తీర్థ ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవగిరి మహారాజ్ మహా భారత్ కథను వినిపిస్తారన్నారు. కృష్ణ భగవాన్ లీలలు, భగవద్గీత ప్రవచనం ఉంటాయన్నారు. 21న ఉదయం వైఎంసీఏ నుంచి గాదిరాజు ప్యాలెస్ వరకూ కలశయాత్ర నిర్వహిస్తామన్నారు.

వృత్తి నైపుణ్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆఫీస్ అసిస్టెంట్ వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 35 ఏళ్ల లోపు విద్యార్థులు 9885694676 నంబరులో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలియజేశారు. మేధా సర్వో డ్రైవ్స్, ఇతర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, ఐటీఐ అన్ని ట్రేడుల ఉత్తీర్ణులు మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థులు అన్ని అన్ని ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 9గంటలకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ వద్దకు హాజరుకావాలని శ్రీకాంత్ కోరారు.

నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద

బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, ఫార్మాసిస్టు, రిటైల్ ట్రైనీ, ఫార్మసీ అసిస్టెంట్, రిలేషన్‌షిప్ ఆఫీసర్, సేల్స్ ఆఫీసర్, టీం లీడర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి రూ.1.2 లక్షల నుంచి రూ.3.5 లక్షల వార్షిక వేతనం ఇస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసినవారు ధ్రువపత్రాలతోహాజరుకావాలన్నారు.

ఆదాయపు పన్ను చెల్లింపులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఆర్ఎస్ బి.శ్రీనివాస్

సిరిపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను చెల్లింపుపై అవగాహన అవసరమని ఐఆర్ఎస్ బి. శ్రీనివాస్ తెలియజేశారు. ఆదాయపు పన్ను శాఖ విశాఖపట్నం, విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం సిరిపురం దత్ ఐల్యాండ్‌లోని వీఐఐసీ సమావేశ మందిరంలో టాక్స్ పేయర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఇన్‌కమ్‌టాక్స్ 1 విశాఖపట్నం ప్రిన్సిపల్ కమిషనర్ ఐఆర్ఎస్ బి.శ్రీనివాస్ హాజరై చట్టం, నిబంధనలు, ప్రత్యక్ష పన్నుల వివాద్ సే విశ్వాస్‌పై వివరించారు. గడువు తేదీలోగా రిటర్న్‌లు దాఖలు చేయడం, నిజమైన రిఫండ్‌లను క్లెయిమ్ చేయడం, చెల్లింపుదారుల హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీసీసీఐ అధ్యక్షుడు ఎం.సుదర్శన్‌స్వామి, పీవీ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ టోర్నీలో మోక్షజ్ఞ, భీష్మలకు పతకాలు



పతకాలతో మోక్షజ్ఞ, భీష్మ

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన చిన్నారులు మోక్షజ్ఞ నారాయణ, భీష్మ నారాయణ పతకాలు సాధించారు. తమిళనాడులోని పొలచ్చిలో జరిగిన ఈ టోర్నీలో మోక్షజ్ఞ 9-11 ఏళ్ల బాలికల ఫ్రీ స్టైల్, సోలో డ్యాన్స్, క్వాడ్రెట్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా, ఫిగర్, పెయిర్ స్కేటింగ్‌లో రజత పతకాలు సాధించింది. బాలుర 7-9 ఏళ్ల విభాగంలో భీష్మ నారాయణ ఫ్రీ స్టైల్, క్వాడ్రెట్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలు, పెయిర్ స్కేటింగ్‌లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. శివాజీ పార్కు స్కేటింగ్ రింక్‌లో కోచ్‌లు పి.సత్యనారాయణ, చిట్టిబాబు వద్ద శిక్షణ పొందుతున్న వీరిని పలువురు అభినందించారు.

'ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేయాలి'

విశాఖపట్నం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు కోరారు. విశాఖ మత్స్యశాఖ కార్యాలయంలో బుధవారం బోటు యజమానులు, చేపల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి జిల్లాలో పూర్తిగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. ఫిషింగ్ బోట్లు, హార్బర్ పరిసరాలు, ఫిష్‌మార్కెట్లు, ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాలవద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి వాతావరణాన్ని కాపాడాలని కోరారు. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రతినిధి హనీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా ప్లాస్టిక్ ప్రభావంతో సముద్ర సంపద తరిగిపోవడం, మానవ మనుగడపై ప్రభావం వివరించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.మురళి, రత్నం, వీర్రాజు, నాగరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదుల స్వీకరణ

- జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తామని కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

- 71 అంశాలతో సిద్ధమైన అజెండా

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్‌కమిటీ సమావేశం ఈనెల 20 జరుగుతుందని కార్యదర్శి బీవీ రమణ తెలిపారు.మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 71 అంశాలతో అజెండా తయారుచేసిసభ్యులకు అందజేశారు. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వీలుగా బీచ్‌రోడ్డుతోపాటు కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు రెండు వరకూ నిర్వహించిన 'స్వచ్ఛతా హ సేవ' కార్యక్రమాల్లో స్నాక్స్, మైక్, బ్యానర్లు, మెమెంటోల కోసం కాంట్రాక్టర్లకు రూ.4.2లక్షలు చెల్లించాలని ప్రతిపాదించారు. అనకాపల్లి నుంచి చెట్లవ్యర్థాలు, పూడికలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు టిప్పర్లను సమకూర్చడానికి రూ.9.7 లక్షలు ఖర్చు అవుతుందని ప్రతిపాదించారు. వినాయకచవితి నిమజ్జనాల సందర్భంగా సముద్రతీరంలో వ్యర్థాలను ఏరివేయడం, రహదారులను శుభ్రపరచడం కోసం నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాలు చెల్లించే అంశాన్ని ప్రతిపాదించారు. మార్కెట్లు, దుకాణాలు వేలం, వివిధ జోన్లలో పనిచేస్తున్న తాత్కాలిక పారిశుధ్య కార్మికుల సేవలు పొడిగింపు, వివిధ వార్డుల్లో కల్యాణమండపాలు, కల్వర్టులు, రోడ్లు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను అజెండాలో పొందుపరిచారు.

జోనల్ డెఫ్ టీ-20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం నిర్వహిస్తున్న ఏపీ జోనల్-1 డెఫ్ టీ- 20 క్రికెట్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. ఏసీఏ వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్ గ్యాలియట్, దఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూన్ గ్యాలియట్ మాట్లాడుతూ డెఫ్ అండ్ డమ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ టోర్నీలో పాల్గొంటున్న విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి (పాడేరు) జిల్లాల క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సమకూర్చుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ వీసీహెచ్ అప్పలనాయుడు, సీసీఏ అకాడమీ ఆపరేషన్స్ మేనేజర్ ఎ.ప్రేమ్‌చంద్, విశాఖపట్నం జిల్లా స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ సంఘం ప్రతినిధులు హసీం, అబ్దుల్ అసదుల్లా, కె.నాగార్జునసాగర్, ఆర్.సంతోష్‌కుమార్, అబ్దుల్ సమీర్, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూలు కులాల ఉప వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సమీక్ష



వినతులు స్వీకరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజన్ మిశ్రా

విశాఖపట్నం/ మహారాణిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ సమాచారం పూర్తిస్థాయిలో అధికారుల వద్ద ఉండాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. ఆయన బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కులాల వారీగా గణాంకాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. విద్య, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ, మార్కెటింగ్ ఎక్సైజ్, వైద్య ఆరోగ్యశాఖ, డీఆర్‌డీఏ, జడ్పీ, ఈపీడీసీఎల్, ఆర్టీసీ, డ్వామా, గిరిజన సంక్షేమ, గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై వివరాలను అందించారు. సమావేశంలో డీఆర్‌వో బీహెచ్ భవానీశంకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం షెడ్యూల్ కులాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకుల నుంచి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి వినతులను స్వీకరించారు. ఉపకులాల ప్రతినిధులు మొత్తం 194 వినతులను అందించారు. ఈ సందర్భంగా జాతీయ రెల్లి ఎస్సీ గ్రూప్ రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణలో ఆర్టికల్ 16(1) ప్రకారం ఏ గ్రూప్‌లో రెల్లి కులాన్ని చేర్చాలని, ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

రాజ్యాంగ వ్యతిరేక తీర్పు

ఎస్సీ వర్గీరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని భీమ్‌సేన్ వార్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, కోరమాటి చిన్నారావులు కమిషన్‌కు విన్నవించారు. రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే వర్గీకరణ జరగాలన్నారు.

చెన్నై, పరాదీప్ ఎక్స్‌ప్రెస్‌లకు కోచ్‌ల కూర్పు

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్, విశాఖ-పరాదీప్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోచ్‌ల కూర్పును సవరించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.ఈరైళ్లు రెండు సెకెండ్ ఏసీ, నాలుగు థర్డ్ ఏసీ, ఏడు స్లీపర్, నాలుగు జనరల్, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్, జనరల్ మోటార్ కార్‌తో నడుస్తాయన్నారు. విశాఖ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌కు (22801) మార్చి 7 నుంచి, తిరుగు ప్రయాణంలో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 8 నుంచి అమల్లోకి రానుండగా...విశాఖ-పరదీప్ ఎక్స్‌ప్రెస్‌కు (22810) మార్చి 9 నుంచి, తిరుగు ప్రయాణంలోని పరాదీప్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22809) మార్చి 10 నుంచి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు చకర్ భటాలో హాల్ట్

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ-కోర్బా మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చాలీసా మహోత్సవం సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో చకర్ భటా స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ నుంచి కోర్బా వెళ్లే రైలు ఈ నెల 9, 10లో ఉదయం 8.44 గంటలకు, కోర్బా నుంచి విశాఖ వచ్చే రైలు ఈ నెల 9, 10 తేదీల్లో సాయంత్రం 6.27 గంటలకు చకర్ భటా స్టేషన్ వద్ద ఒక నిమిషంపాటు ఆగుతుందన్నారు.

హిరాఖండ్‌కు తాత్కాలిక అదనపు కోచ్

ప్రయాణికుల సౌకర్యార్థం భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 19 నుంచి 31 వరకు స్లీపర్ క్లాసు కోచ్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 20 నుంచి జనవరి 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేస్తున్నామన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి